ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
గురువారం 23-07-2026 పేజీలు : 16

## హరితహారం-పారిశుద్ధ్యానికి
# పెద్దపీట

- తిమ్మాపూర్, కుదురుగుంట గ్రామాల్లో ఎంపీడీవో శాంతమ్మ, ఏపీవో అంజిరెడ్డి విస్తృత పర్యటన
- ఇందిరమ్మ ఇళ్లకు సోక్‌పిట్ మార్కింగ్.. 3,500 మొక్కల నాటడానికి శ్రీకారం.. గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన

6 పేజీలో...

## ఆదాయంలో కోట్లు... వసతుల్లో చాట్లు...
# ప్రత్యేక కథనానికి ఫలితం


ఆదాయంలో 'కోట్లు'.. వసతుల్లో 'చాట్లు'
విజన్ ఆంధ్ర

2 పేజీలో...

- రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు శాశ్వత భవనాల దిశగా అడుగు
- 35 గుంటల స్థలం కేటాయింపు

షాద్ నగర్, విజన్ ఆంధ్ర జూలై22 : "ఆదాయంలో కోట్లు... వసతుల్లో చాట్లు"విజన్ ఆంధ్ర అనే శీర్షికతో వెలువడిన ప్రత్యేక కథనానికి ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించారు. ఎన్నో ఏళ్లుగా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫరూక్‌నగర్, షాద్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి కీలక అడుగు పడింది.

## కాంగ్రెస్ శ్రేణుల
# నిరసనలు..
## దద్దరిల్లిన మండల కేంద్రాలు

- ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ఆదేశం
- రంగంలోకి పార్టీ శ్రేణులు
-బీజేపీ వైఖరిని ముక్తకంఠంతో ఖండించిన శ్రేణులు
- మండల కేంద్రాల్లో మోదీ దిష్టిబొమ్మ దహనాలు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే సహించబోమని హెచ్చరిక
- రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు పై ధ్వజం

ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తో పాటు ప్రియాంక గాంధీ ల అక్రమ అరెస్టులను నిరసిస్తూ.. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ఆదేశానుసారం..

2 లో...

## ఎల్ నినోను సమిష్టిగా ఎదుర్కొందాం

- అదనపు కలెక్టర్ శ్రీజ
- ఎల్ నినోపై మండలస్థాయి సమీక్ష

6 పేజీలో...

## కార్యకర్తలకు అండగా ఉంటాం

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

-చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో అనారోగ్యంతో ఉన్న బీఆర్ఎస్ నాయకుల పరామర్శ
-ఎల్ఐసీ రాజు, చిప్ప రమేష్ కుటుంబాలకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే
-పార్టీ కార్యకర్తల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని స్పష్టం
-అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తామని హామీ

4 పేజీలో...



## నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో గుప్తనిధుల కలకలం



- మామిళ్లపల్లి పురాతన ఆలయం వద్ద అర్ధరాత్రి తాంత్రిక తవ్వకాలు
- 6 అడుగుల గుంత, తాయత్తులు లభ్యం - ఆలయ పవిత్రతకు భంగం

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 22 (విజన్ ఆంధ్ర): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో గుప్తనిధుల పేరుతో జరిగిన అక్రమ తవ్వకాలు పెద్ద దుమారం రేపాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన శివాలయం సమీపంలో సోమవారం రాత్రంతా జరిగిన ఈ తవ్వకాలతో గ్రామమంతా భయాందోళనకు గురైంది. గుప్తనిధులు ఉన్నాయనే మూఢనమ్మకంతో కొందరు అర్ధరాత్రి వచ్చి ఆలయ పరిసరాలను అపవిత్రం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

14 పేజీలో...

## పాపిరెడ్డి నగర్‌లో అక్రమ వాటర్ ప్లాంట్ల పై అధికారుల ఉక్కుపాదం సీజ్ చేసి హెచ్చరికలు



14 పేజీలో...

# విద్యుత్ లైన్ మాన్ రమేష్ తన సొంత డబ్బులతో పనులు

**ప్రజలకు ఇలాంటి విద్యుత్ సమస్య ఏర్పడకుండా సుమారు తన సొంత డబ్బులు 20వేలు ఖర్చు**



అందోల్ జూలై 22 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం లో విద్యుత్ లైన్ మాన్ గా పనిచేసే రమేష్ తన సొంత డబ్బులతో పనులు చేశారు.ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్య ఏర్పడకుండా సుమారు తన సొంత డబ్బులు 20వేలు ఖర్చు చేసి గ్రామంలో ఉన్న ముళ్లపదాలను చెట్లను విద్యుత్ తీగలకు అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ తీగల ద్వారా ప్రజలకు ఎలాంటి వాంఛనీయ ఘటనలు జరగకుండా తన సొంత డబ్బులుతో చెట్ల కొమ్మలను నరికి వేయడం జరిగింది. చెట్ల కోసం ఖర్చు చేసినప్పటికీ ప్రభుత్వం పరంగా ఎలాంటి ఆర్థిక సాయం అందలేదని విజన్ ఆంధ్ర ప్రతి నిధి ముందు వారు వాపోయారు.ప్రభుత్వం పరంగా వచ్చే డబ్బులు ఎక్కడికి వెళ్తున్నానని ఏఈని ప్రశ్నించారు.అయినప్పటికీ వారు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రైతులు నూతన వ్యవసాయ సాగు పద్ధతులపై దృష్టి సారించాలి

కుల్కచర్ల, జూలై, 22(విజన్ ఆంధ్ర): రైతులు నూతన వ్యవసాయ సాగు పద్ధతులపై దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, ఆత్మ డైరెక్టర్ ఆనంద్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కుల్కచర్ల మండల రైతులకు పంటల సాగు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కుల్కచర్ల మండలంలో ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఫలితంగా నేల సారం కోల్పోవడమే కాకుండా నేలలో నీటి శాతం తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. అందుకే తక్కువ నీటితో సాగయ్యే మేలైన పంటలు కంది, వేరుశనగ వంటి పంటల సాగు పై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పంట మార్పిడి పద్ధతిపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎరువుల వినియోగం, సేంద్రీయ ఎరువుల వాడకం, పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్, మాజీ ఎంపిటీసీ ఆనందం, వ్యవసాయ శాఖ అధికారులు, తెలంగాణ విశ్వవిద్యాలయ విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి



నంగునూరు మండలం జూలై 22 విజన్ ఆంధ్ర సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ బల్ల మల్లేశం తెలిపారు.గ్రామంలోని మొత్తం 1,035 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, బీఎల్ఓ రేణుక ఆధ్వర్యంలో డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు జీపీఓ ఆంజనేయులు గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ పరిశీలనలో భాగంగా గ్రామంలో 45 మంది ఇతర ప్రాంతాలకు మారిన (షిఫ్టెడ్) ఓటర్లు 27 మంది మరణించిన ఓటర్లు 6 డబుల్ ఓట్లు గుర్తించి, వాటిని ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు వెల్లడించారు. ప్రజల సహకారం వల్లే ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయగలిగామని సర్పంచ్ బల్ల మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్ఓ రేణుక, గ్రామపంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రెడ్డి జాతి గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించం: బుట్టెం మాధవరెడ్డి



అక్కన్నపేట, జూలై 22 (విజన్ ఆంధ్ర) : రెడ్డి జాతి ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలనైనా సమాజం సహించబోదని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెం మాధవరెడ్డి స్పష్టం చేశారు.

సమాజంలో ప్రతి వర్గానికి సమాన గౌరవం ఉండాలని, అభిప్రాయ భేదాలు సహజమే అయినప్పటికీ ఏ వర్గాన్నీ అవమానించేలా మాట్లాడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. రెడ్డి సమాజంపై ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న వ్యక్తులు తమ వ్యాఖ్యల విషయంలో సంయమనం పాటించాలని సూచించారు. సమాజంలో శాంతి, పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం నెలకొనాలంటే రెచ్చగొట్టే, అవమానకర వ్యాఖ్యలకు తావు ఇవ్వకూడదన్నారు.

రెడ్డి సమాజాన్ని అవమానించిన వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా తమ నిరసనను వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

"రెడ్డి జాతి గౌరవం మా ఆత్మగౌరవం. ఐక్యతే మా బలం -- ఆత్మగౌరవమే మా ధ్యేయం" అని బుట్టెం మాధవరెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు.. దద్దరిల్లిన మండల కేంద్రాలు

పెద్ద ఎత్తున మోదీ డౌన్ డౌన్ నినాదాలతో హోరెత్తించారు. నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో పాటు విద్యార్థుల పై లాఠీ చార్జ్ కు కేంద్రం హోమ్ శాఖ మంత్రి అమిత్ షా లు నైతిక బాధ్యత వహిస్తూ.. రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన యువకులను రోడ్డు బాట పట్టేలా చేసి.. అమానవీయంగా లాఠీ ఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలను తమ రాహుల్ గాంధీ, ఇక్కడ సిఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ల నేతృత్వంలో ఎప్పటికప్పుడు ఎండగడతామని అవసరమైతే ఎలాంటి ఉద్యమాలకైనా బెదరబోమని హెచ్చరించారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు జనార్ధన్, అంబర్ సింగ్, కిషన్, గోవర్ధన్ రెడ్డి, నరేష్, రవి, సంజయ్ రెడ్డి లు నేతృత్వం వహించగా కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు నిరసనల్లో పాల్గొన్నారు.

# ఆదాయంలో కోట్లు... వసతుల్లో చాట్లు...

# ప్రత్యేక కథనానికి ఫలితం

**- రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు శాశ్వత భవనాల దిశగా అడుగు**

**- 35 గుంటల స్థలం కేటాయింపు**

షాద్ నగర్, విజన్ ఆంధ్ర జూలై22 : "ఆదాయంలో కోట్లు... వసతుల్లో చాట్లు"విజన్ ఆంధ్ర అనే శీర్షికతో వెలువడిన ప్రత్యేక కథనానికి ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించారు. ఎన్నో ఏళ్లుగా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫరూక్‌నగర్, షాద్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి కీలక అడుగు పడింది.ప్రభుత్వం షాద్‌నగర్ పాత జాతీయ రహదారి పక్కన ఉన్న పాత కోర్టు స్థలంలోని సర్వే నంబర్ 178లో 35 గుంటల భూమిని రెండు రిజిస్ట్రేషన్ కార్యాలయాల భవనాల నిర్మాణం కోసం కేటాయించింది. బుధవారం ఫరూక్‌నగర్ తహసీల్దార్ సమక్షంలో స్థలానికి హద్దులు నిర్ణయించి, ఫరూక్‌నగర్ ఇన్‌చార్జ్ సబ్-రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి, షాద్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ శేషగిరికి అధికారికంగా స్వాధీనం చేశారు.ఏటా కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చే ఈ కార్యాలయాలు ఇప్పటి వరకు సరైన వసతులు లేక అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ప్రజలు, సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై వెలువడిన ప్రత్యేక కథనం అనంతరం ప్రభుత్వం చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.భూమి కేటాయింపుతో నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమై, ఏడాది గడువులోపు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ సేవలు మరింత సమర్థవంతంగా, ప్రజలకు సౌకర్యవంతంగా అందే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



## -కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిర్మల్ రెడ్డి

మర్కుక్ జూలై 22,(విజన్ ఆంధ్ర ): మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తి గ్రామనికి చెందిన రాజంగారి సత్తమ్మ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మరణించింది. విషయం తెలుసుకున్న కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు పాములపర్తి తిర్మల్ రెడ్డి మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.వారితో పాటు కాంగ్రేష్ పార్టీ గ్రామ అధ్యక్షుడు క్రాంతి కుమార్,గ్రామ ఉపాధ్యక్షుడు మల్లేష్,నాయకులు లక్ష్మణ్,కిషన్,సుధాకర్ గౌడ్,నర్సింలు,మలయ్య నాగరాజు,పరుశరామ్ తదితరులున్నారు.

# ఆలయంలో అన్నదానానికి ఖాళీలు

## - టోకెన్ల జారీ

బాల్కొండ (నిజామాబాదు ) విజన్ ఆంధ్ర ఆర్. సి.జులై 22:- నిజామాబాదు జిల్లా బాల్కొండ లో 524 సంవత్సరాలనుండి కొలువై ఉన్న శ్రీ నిమిషంబా ఆలయంలో అన్నదానానికి 2026 ఆగస్ట్ నుండి డిసెంబర్ వరకు ఖాళీలు ఉన్నాయని టోకెన్ల జారీ చేస్తున్నట్లు ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు."అలకొండ పురి రమ్య నగై: నవబి రావృతా !తత్రేషా తు మహాదేవి నిమిషాంబా ప్రతిష్ఠితా!! (తొమ్మిది ఏతైనా నల్ల రాల్ల కొండల చేత చుట్టబడి ఉన్న అందమైన అల్లకుండ, వల్లకొండ, ఏబాల్కొండ అనే గ్రామంలో మార్చ్ 2018 నుండి ఆలయంలో ప్రతి నెల మొదటి శుక్రవారం రోజు వివిధ ప్రాంతాల భక్తుల నుండి ఆలయంలో అన్నదానం జరుగుతుంది ఉ ందని ఇందులో భాగంగా నెల వారీగా టోకెన్ నంబర్లు జారీ చేస్తున్నామని టోకెన్ నేం (79) ఆగస్ట్ మొదటి శుక్రవారశీ అన్నదానం చేయాలనుకు నే కుటుంబాలు తమ కుటుంబ పేర్లు, గోత్రాలు మరియు కుటుంబ సమూహ ఫోటోలతో 9666759297 నంబ ర్కు ఫోన్ చేసి టోకెన్ నంబర్ పొందాలని ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు. అన్న దానం మహాదానం, నిత్యం చేస్తే పుణ్యఫలం, అన్నం లేనివారికి, దానం చేయడం మానవ ధర్మం ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం నిత్యం దేవుని సేవించడం ఒకటే అని ఆలయ సేవకులు బి. ఆర్. నర్సింగ్ రావుఈ సందర్భంగా భక్తులకు వివరించారు.

ఈ క్షేత్రానికి ఏలా చేరుకోవాలి

నిజామాబాద్ జిల్లా బాల్కొండలో కొలువై ఉన్న శ్రీ నామిషంభ దేవి హైదరాబాద్ పట్టణానికి 200 కిలోమీటర్ దూరంలో హైదరా బాద్ - నాగపూర్ జాతీయ రహదారి పై బాల్కొండ ఉంది.అతి సమీ పంలో ఆసియ ఖండం లో నే వెడల్పు అయినా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 8 కి.మీ. దూరంలో కలదు.పవిత్ర శక్తి పీఠాలలో ఉత్తమ మైన శక్త. స్వరూపిణి అయిన శ్రీ నిమిషంబ దేవి అమ్మ వారిని దర్శించుకుని జీవన ముక్తి పోదాలని అసిసద్దామా ....మరి.

# నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

## -- ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ధనపనేని వెంకటేశ్వర్లు

వెంకటాపురం (నూగూరు) జూలై 22 (విజన్ ఆంధ్ర): నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, యువతలో తీవ్ర ఆందోళన, అభద్రతకు కారణమయ్యాయి అని, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అత్యంత కీలకమైన అంశంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ధనపనేని వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నాయకత్వంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమం దేశ యువతకు అండగా నిలిచే బాధ్యతాయుత ప్రయత్నమని ఈ కార్యక్రమాన్ని నిరంకుశంగా లాఠీ ఛార్జి, అరెస్టు లతో ఆపలేరని, ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అలాంటి నిరసనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బలవంతంగా అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా ఆయన అభివర్ణించారు.



నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి, పారదర్శక విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకొని దేశ విద్యార్థుల్లో కోల్పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తును రాజకీయాలకు అతీతంగా పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని,కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థులు, యువత హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందని ధనపనేని వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

# నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



భూపాలపల్లి జిల్లా జులై 22 ( విజన్ ఆంధ్ర ) దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును కాపాడాలని, పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలపై పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని తెలంగాణ విద్యావంతుల వేదిక తీవ్రంగా ఖండిస్తోంది.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అణచివేయడం కాకుండా, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.

నేడు విద్య ఒక ప్రాథమిక హక్కు అయినప్పటికీ, అది క్రమంగా వ్యాపారంగా మారిపోయింది. విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలను పాలకులు కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతి విద్యార్థి, యువకుడు, మేధావి, ప్రజాస్వామ్యవాది స్పందించాల్సిన అవసరం ఉంది.ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపడుతున్న శాంతియుత నిరసన కార్యక్రమానికి తెలంగాణ విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. విద్యార్థుల న్యాయమైన పోరాటానికి రాష్ట్రంలోని విద్యార్థులు, యువత, మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజలందరూ సంఘీభావం ప్రకటించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు రాదండి దేవేందర్ పిలుపునిచ్చారు.

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## - సిద్ధిపేట డిప్యూటీ సీఈవో,మర్కుక్ ప్రత్యేక అధికారి సంధ్య

## - మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము

మర్కుక్ జూలై 22,(విజన్ ఆంధ్ర ) : సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని పాములుపర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నాడు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా డిప్యూటీ సీఈవో మర్కుక్ మండల ప్రత్యేక అధికారి సంధ్య,మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలన్నారు.అధిక నీటి అవసరం ఉ న్న వరి పంటకు బదులుగా పంట మార్పిడి విధానాన్ని అనుసరించి కూరగాయలు,నూనెగింజల (ఆయిల్ సీడ్) పంటలను సాగు చేయాలని సూచించారు.అలాగే ప్రతి రైతు తన పొలంలో పంట కుంటలను నిర్మించుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని,తద్వారా అవసరమైన



సమయంలో పంటలకు జీవనాధార నీటిని అందించవచ్చని వివరించారు.వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ,వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించి పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు.ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక,నీటి యాజమాన్యం,పంట మార్పిడి వంటి చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుబ్బాసి భవాని బాల కిషన్,ఉప సర్పంచ్ జుట్టు సుధాకర్,వార్డు సభ్యులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మండల అధ్యక్షుడిగా అన్నారెడ్డి



భూపాలపల్లి జిల్లా జులై 22 (విజన్ ఆంధ్ర ) మొగుళ్ళపల్లి మండల తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మండల అధ్యక్షుడిగా ముల్కలపల్లి గ్రామానికి చెందిన సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు.. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు..మలిదశ తెలంగాణ ఉద్యమానికి మండలంలో ఊపిరి పోసిన చదువు అన్నారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. బుధవారం మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయి లక్ష్మి గార్డెన్ లో జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులంతా చదువు అన్నారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు పున్నం రవి ప్రకటించారు. చదువు అన్నారెడ్డి 2001లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే లక్ష్యంగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీలో చేరి..టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతూ...మండలంలోని అన్ని పార్టీలను కలుపుకొని తెలంగాణ పొలిటికల్ జేఏసీని ఏర్పాటు చేశారు. పొలిటికల్ జేఏసీకి నాయకత్వం వహిస్తూ..జేఏసీ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నాటి పొలిటికల్ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలో సకలజనుల సమ్మె, రోడ్లపై వంటావార్పు, రహదారుల అష్టదిగ్బంధనం, రిలే నిరాహార దీక్షల్లాంటి ముఖ్యమైన కార్యక్రమాలను చేపట్టి..ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయన తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలను ఉద్యమకారులంతా గుర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపునిచ్చి, వారి హక్కులను కాపాడేందుకు మరో పోరాటానికి సిద్ధమవుతున్న తరుణంలో..అన్నారెడ్డి సేవలను వినియోగించుకోవాలనే సంకల్పంతో ఉద్యమకారులంతా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పున్నం రవి తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన చదువు అన్నారెడ్డి మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బృహత్తరమైన బాధ్యతలను అప్పగించిన తెలంగాణ ఉద్యమకారుల హక్కులను కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం



వెంకటాపురంనూగూరు, జూలై 22,(విజన్ ఆంధ్ర) : ఢిల్లీలో నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ పేపర్ లీక్ కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని ఖండించారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ధనపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పేపర్ లీక్ పై పారదర్శక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టెం సాయి, సర్పంచులు సురిటి రాజేశ్వరి, తాటి సరస్వతి, కాంగ్రెస్ నాయకులు మన్యం సునీల్, సీతాదేవి, పిట్ట సాయిబాబు, కిరణ్, మురళి , అన్వర్ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం సాగుకు అవకాశం..

**- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య**



కుకునూరుపల్లి, జులై 22,విజన్ ఆంధ్ర : ఎలినినో ప్రభావం ఎక్కువగా ఉన్నందున, రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటలు వేసుకోవాలని కుకునూరుపల్లి సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ అలీ, ఎంపీవో నాగభూషణం, వ్యవసాయ అధికారి గోవింద రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షా కాలం దృష్ట్యా ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి గోవింద రాజు మాట్లాడుతూ రైతులు జొన్న, సజ్జ, అపరాలు, నువ్వులు, ఆముదాలు, రాగులు, కూరగాయలు, ఆయిల్ పామ్ తోటలు పెంచాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు ఆహ్వానం...

బోధన్, జులై 22(విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు, బోధన్, సాలూర మండలాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2027--28 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను 2026 జులై 31లోపు నమోదు చేసుకోవాలని బోధన్ మండల విద్యాధికారి నాగయ్య, సాలూర మండల విద్యాధికారి రాజ మంజుష లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయాల్లో నాణ్యమైన, ఉచిత నివాస విద్యతో పాటు ఉత్తమ విద్యా అవకాశాలు కల్పించబడుతున్నందున, అర్హత కలిగిన ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ ఈ సమాచారం చేరేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దరఖాస్తు నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జులై 22 (విజన్ ఆంధ్ర); పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా నిలుస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎల్ఐసీ రాజు మరియు చిప్ప రమేష్ అనారోగ్యంతో ఉన్నారనే సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ తరపున అవసరమైన ప్రతి సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తల సంక్షేమం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మహ్మద్ రఫీతో పాటు సీనియర్ నాయకులు సాంబయ్య, ఉప్పలయ్య, సామ్రాట్, లక్ష్మన్, చందు, శ్రీధర్, ప్రభాకర్, జహంగీర్, బాలు నేత, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే స్పందనను అభినందిస్తూ, కార్యకర్తల పట్ల ఆయన చూపుతున్న ఆప్యాయత, బాధ్యతాయుత వైఖరి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

## నీట్ విద్యార్థులపై ఢిల్లీలో లాటి చార్జి చేసిన దానిని నిరసిస్తూ భీమదేవరపల్లి మండల ముల్కనూర్ అంబెడ్కర్ కూడలి వద్ద నిరసన ధర్నా

భీమదేవరపల్లి జులై 22 (విజన్ ఆంధ్ర) : NEET పరీక్షా పేపర్ల వరుసగా లీకేజీ అయిన తర్వాత నిరుద్యోగ అభ్యర్థులు సుమారు 20 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు, సంవత్సరాల కొద్దీ జాతీవ-జ్ఞుతీవ అయి అనేక వ్యయప్రయాసలకు ఒర్చి నిరాశతో సుప్రీమ్ కోర్టు కు వెళ్తే, కోర్టు అభ్యర్థులను, విద్యార్థులను, యువతను కాక్రోచ్ బ్యాచ్‌లు అని అవమానపరిచిన విషయం మనకు తెలుసు.. అవమానానికి గురైన విద్యార్థి, యువత కాక్రోచ్ పార్టీ ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో, అహింసా మార్గంలో ఉద్యమం చేస్తున్న సందర్భంగా వారికి మద్దతుగా ప్రముఖ పర్యావరణ పరిరక్షణ, విద్యా వేత్త మరియు మెగాసేసా అవార్డు గ్రహిత సోనమ్ వాంగ్ చుక్ గత 25 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండగా అక్రమంగా అరెస్ట్ చేయడం, నిన్న పార్లమెంట్ మార్చ్ కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లను విచక్షణా



రహితంగా లాఠీచార్జి చేసి రక్త శిక్తం చేయడం హేయమైన చర్య.. యువతను అరెస్టు చేసి కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ, ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద నిరసన ధర్నా కార్యక్రమం చెయ్యడం జరిగింది నాయకులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి నీట్ పేపర్ లీకేజీలు మరణించిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం చెల్లించాలి అరెస్టు చేసిన సునం హంగు చుక్కు వెంటనే విడుదల చేయాలి విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి నీట్ పేపర్ లీకేజీ కాకుండా సమగ్ర పాలసీ చట్టం తీసుకురావాలి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి ప్రధాని మోడీ మరియు హోంశాఖ మంత్రి అమిషలను రాజీనామా చేయాలి లో లాటించార్జ్ లో గాయాలైన వారికి నష్టపరిహారం ఇవ్వాలి అని మాట్లాడినారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జేూజ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి జేూజ భీమదేవరపల్లి మండల చైర్మన్ ద్యాగల సారయ్య వీ౯బా హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ అంబేద్కర్ సంఘ నాయకులు కండె సుధాకర్ మాడుగుల కొమురయ్య పెద్ద కుమారస్వామి తాళ్ల పెల్లి ఆశీర్వాదం ఆర్ బిక్షపతి పార్నందుల సురేష్ తాళ్లపల్లి జగన్ పెట్టం కుమారస్వామి గాన్ల పద్మ అంబేద్కర్ సంగం మండల కన్వీనర్ ఎల్తూరు ప్రేమ్ రాజ్ భీమదేవరపల్లి సిపిఐ భీమదేవరపల్లి మండల కార్యదర్శి ఆదరి రమేష్ సిపిఐ నాయకులు కుమారస్వామి కిరణ్ రవి జేపీసీ నాయకులు చంద్రమౌళి రోడ్డ సంపత్ అందరూ పాల్గొని నిరసన ధర్నాను విజయవంతం చేసినారు

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ లాఠీచార్జీకి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలి

**- రాహుల్ గాంధీ మల్లికార్జున కరిగే ప్రియాంక గాంధీ 100 మంది ఎంపీలను అక్రమంగా అరెస్టు చేశారు**

**- హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా అరెస్టును తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్**

**- ధర్నాలో పాల్గొన్న బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 22 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ,ఇతర ఎంపీలు ముఖ్య నేతల అరెస్టులకు నిరసనగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జి ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమంలో నిరంకుశత్వంగా వ్యవహరిస్తు అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండింస్తు కాంగ్రెస్ పార్టీ మహాధర్నా నిర్వహించింది. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కి కారణమైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని,నీట్ అంశంపై పార్లమెంట్లో చర్చ జరగాలని,నీట్ పేపర్ లీక్ పై హోంమంత్రి సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీక్ తో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్రేషియా ఇవ్వాలన్నారు.ఢిల్లీలో విద్యార్థుల లాఠీచార్జి హింసపై విచారణ జరిపించాలని ప్లేకార్డులతో నిరసన తెలిపారు.దేశంలో జరుగుతున్న అనేక పరిణామాల్లో ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తున్న పార్టీగా విద్యార్థులపై జరిగిన దాడికి నిరసనగా వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,ప్రియాంక గాంధీ, ఎంపీలు ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయాలని చేసిన శాంతియుత నిరసనను బీజేపీ ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిసా్త అరెస్ట్ చేశారన్నారు.మొన్న జరిగిన విద్యార్థుల నిరసన ప్రజాస్వామ్యంలో స్వతంత్ర ఉద్యమాన్ని,సత్యాగ్రహాన్ని తలపించిందని,

శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులు తిరగబడకుండా పోలీసులు కొడుతుంటే ఇంకా కొట్టండి అని గాంధేయవాదిగా నిరసన తెలిపారన్నారు.అనేక మంది విద్యార్థులకు గాయాలయ్యాయని, విద్యార్థుల లాఠీచార్జ్ పై కనీసం హోంమంత్రి సంఘీభావం తెలపలేదన్నారు.ఇప్పటికే ఛాత్రోంకి గుంజ్ పేరుతో దేశ వ్యాప్తంగా విద్యార్థులతో రాహుల్ గాంధీ గారు విద్యా వ్యవస్థ పై మాట్లాడుతు విద్యార్థుల గొంతు వినిపిస్తున్నారన్నారు.నరేంద్ర మోడీ ఇంటి ముందు శాంతియుత నిరసన చేస్తే అక్రమ అరెస్టులు చేశారని,దానిపై నరేంద్ర మోడీ ఇంత వరకు మాట్లాడలేదన్నారు. స్వాతంత్ర్యాన్ని తెచ్చిన పార్టీగా ప్రజాస్వామ్యానికి రక్ష కాంగ్రెస్ పార్టీ లాఠీచార్జి కి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని గాయపడిన వారికి మంచి వైద్యం అందించాలన్నారు.నీట్ పేపర్ లీకేజీ ఘటనలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.లీకేజీ కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని,ధర్మేంద్ర ప్రధాన్ ను మోదీ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు నీట్ పేపర్ లీకేజీ పై పార్లమెంట్ లో చర్చించాలని,దేవుడి పేరు మీద ఓట్లు అడిగే బీజేపీ అయోధ్యలో పైసలు గల్లంతు చేశారు,దోపిడి చేశారన్నారు.వాళ్ళను అయోధ్యలో ముందే గ్రహించి అక్కడ బీజేపీని కూడా గెలిపించలేదని,తెలంగాణ ఏర్పాటు పట్ల వివక్ష పూరితంగా మాట్లాడుతున్నారన్నారు.

అంబేద్కర్ సాక్షిగా డిమాండ్ చేస్తున్న లాఠీచార్జిపై స్పందించాలి,నీట్ పై చర్చించాలన్నారు.

రాహుల్ గాంధీ మల్లికార్జున్ ఖర్గే ప్రియాంక గాంధీ వంద మంది ఎంపీలు ధర్నా చేస్తుంటే వారిని అక్రమంగా అరెస్టులు చేశారు దానిని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వృత్తి శిక్షణ కోర్సులకు శిక్షకులు అవసరం

మందమర్రి, జూలై 22(విజన్ ఆంధ్ర) : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వివిధ వృత్తి శిక్షణ కోర్సులలో అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన శిక్షకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఏరియా డిజిఎం పర్సనల్ సి. హెచ్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా టైలరింగ్,ఫ్యాషన్ డిజైనింగ్,బ్యూటీషియన్ 3 నెలలు,కంప్యూటర్ డిటిపి 2 నెలలు కోర్సులకు అవసరమన్నారు. సంబంధిత కోర్సులలో తగిన అర్హత,అనుభవం కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను అందించాలన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్లు,అనుభవ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన క్వాలిఫికేషన్ సర్టిఫికెట్,ఆధార్ కార్డ్,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలన్నారు.అభ్యర్థులు తమ ధ్రువపత్రాల జిరాక్స్ లతో కూడిన దరఖాస్తులను మందమర్రి జి.ఎం కార్యాలయంలోని జి.ఎం.పి.ఎ సెక్షన్ నందు ఇవ్వాలన్నారు. ఈ నెల 30 లోపు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

# అసెంబ్లీ కన్వీనర్ పదవులు రద్దయ్యాయి..

## లక్ష్మారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి: బత్తుల శంకర్ బాబు



అక్కన్నపేట, జూలై 22 (విజన్ ఆంధ్ర) : పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ కన్వీనర్ పదవులు రద్దయ్యాయని, అయినప్పటికీ తాను ఇప్పటికీ అసెంబ్లీ కన్వీనర్‌నని చెప్పుకుంటూ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్న లక్ష్మారెడ్డిపై రాష్ట్ర పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు.

బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో ప్రతి ఐదేళ్లకోసారి సంస్థాగత నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా బూత్, మండల, జిల్లా, అసెంబ్లీ స్థాయి కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే హుస్నాబాద్ నియోజకవర్గంలో లక్ష్మారెడ్డి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ, తానే నిర్ణయాలు తీసుకునే వ్యక్తినని చెప్పి కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

ఇటీవల హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన సమావేశానికి తనకు అనుకూలమైన వారినే పిలిచి, పట్టణం మరియు నియోజకవర్గంలో వర్గాలను సృష్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ కన్వీనర్ పదవులు రద్దయినప్పటికీ, తానే కన్వీనర్‌నని చెప్పుకుంటూ కార్యకర్తలు, నాయకుల మధ్య విభేదాలు సృష్టిస్తూ పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కొందరు కార్యకర్తలకు పదవులు రావని, వారి రాజకీయ భవిష్యత్తు ముగిసిందంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని బత్తుల శంకర్ బాబు కోరారు. లక్ష్మారెడ్డి ప్రస్తుతం అసెంబ్లీ కన్వీనర్ కాదని, ఆయనపై రాష్ట్ర పార్టీ తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హుస్నాబాద్ నియోజకవర్గంలో రెండోసారి భారీ మెజారిటీతో విజయం సాధించినప్పటికీ, గతంలో పార్టీ నియమావళి ప్రకారమే కార్యకలాపాలు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం లక్ష్మారెడ్డి వ్యక్తిగత ఇమేజ్ కోసం అసెంబ్లీ కన్వీనర్ హోదాను ఉపయోగించుకుంటూ పార్టీలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

సిద్ధిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఈ వ్యవహారంపై స్పందించకుండా వ్యవహరించడం వివాదాలకు ఆజ్యం పోస్తున్నట్లుగా కనిపిస్తోందని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడి తర్వాత ప్రధాన కార్యదర్శి కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా, పార్టీ నియమావళికి విరుద్ధంగా కార్యక్రమాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు.

లక్ష్మారెడ్డి వ్యవహారంపై జిల్లా అధ్యక్షుడు వెంటనే రాష్ట్ర పార్టీకి నివేదిక పంపించి, తగిన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు.

# మూడు జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా

**నేడు హుస్నాబాద్ లో నియోజకవర్గ వర్షాకాల ఎల్ ని ఓ సమీక్ష**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 22 : ఈనెల 23వ తేదీ గురువారం రోజున సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసిలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ ఏడు మండలాలకు సంబంధించి వానకాలం 2026 ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కొనేందుకు ఆయా శాఖల అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశ ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నియోజవర్గములో ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కొనేందుకు నిర్వహించే సన్నాహక సమావేశానికి 3 జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామపంచాయతీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్ తదితరులు శాఖల అధికారులందరికీ వస్తారని, వారి యొక్క యాక్షన్ ప్లాన్ తెలపడం కోసం ప్రొజెక్టర్ ఏర్పాటు చెయ్యాలని, జిల్లాల వారిగా అధికారులకు సిట్టింగ్,3 జిల్లాలు 7 మండలాలు కావున వాటర్ సౌకర్యం కల్పించాలని అలాగే ఉదయం నుండి సాయంత్రం దాకా కొనసాగుతుందని మధ్యాహ్నం భోజనంతో పాటుఅన్ని ఏర్పాట్లు చెయ్యాలని అధికారులను ఆదేశించారు.

**ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు రైతు బజార్ లో తాత్కాలిక వసతి**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థునుల వసతి కోసం కేటాయించిన హుస్నాబాద్ పట్టణంలో 20 వ వార్డులో గల రైతు బజార్ భవనంలో మొదటి, రెండవ అంతస్తును సందర్శించి అందులో విద్యార్థునుల వసతికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు మరియు శాతవాహన ఇంజనీరింగ్ వారికి దిశా నిర్దేశం చేశారు.శాశ్వత ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం అయ్యేంతవరకు తాత్కాలికంగా విద్యార్థునులకు ఇక్కడ కేటాయించిన మొదటి, రెండవ అంతస్తులో మౌలిక వసతులు, మరుగుదొడ్లు, మరియు భోజనం శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో కలిసి అన్ని సదుపాయాలను సక్రమంగా కల్పిస్తామని తెలిపారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్, లక్ష్మారెడ్డి శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

# హరితహారం-పారిశుద్ధ్యానికి పెద్దపీట

**- తిమ్మాపూర్, కుడుగుంట గ్రామాల్లో ఎంపీడీవో శాంతమ్మ, ఏపీవో అంజిరెడ్డి విస్తృత పర్యటన**

**- ఇందిరమ్మ ఇళ్లకు సోక్‌పిట్ మార్కింగ్.. 3,500 మొక్కల నాటడానికి శ్రీకారం.. గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన**

మర్పల్లి, జూలై 22 (విజన్ ఆంధ్ర): మర్పల్లి మండలంలోని తిమ్మాపూర్, కుడుగుంట గ్రామపంచాయతీల్లో గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీడీవో శాంతమ్మ , ఏపీఓ అంజిరెడ్డి బుధవారం పరిశీలించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు వ్యక్తిగత సోక్‌పిట్‌ల ఏర్పాటుకు మార్కింగ్ ఇవ్వించారు. అలాగే గ్రామ చివరలో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) నిధులతో రూ. 92 వేల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ సోక్‌పిట్‌కు కూడా మార్కింగ్ చేశారు.

అనంతరం కుడుగుంట గ్రామపంచాయతీలో హరితహారం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో శాంతమ్మ, గ్రామానికి మంజూరైన 3,500 మొక్కలలో తొలి విడతగా 350 మొక్కలను నాటించారు. మే నెలలో తవ్విన గుంతల్లో ప్రస్తుతం మొక్కల నాటకం కొనసాగుతోందని తెలిపారు. గ్రామంలోని మహిళలకు తడి చెత్త--పొడి చెత్త వేరు చేయడానికి రెండు రకాల చెత్త బుట్టలను ఎంపీడీవో శాంతమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామస్తులను ఉద్దేశించి ఎంపీడీవో శాంతమ్మ మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు



ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటిని మరిగించి చల్లార్చి తాగాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను బయట పడేయకుండా అందించిన బుట్టల్లోనే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందజేయాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి కీలకమని ఎంపీడీవో శాంతమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ--శంకరయ్య, ఉపసర్పంచ్ శేఖర్, వార్డు సభ్యురాలు నర్సమ్మతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, 15 మంది కూలీలు చురుకుగా పాల్గొన్నారు.




# ఢిల్లీలో జరిగిన లాఠీ చార్జ్‌కు నిరసనగా ఈనెల 24న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**-యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు**

గాదిగూడ,జూలై 22(విజన్ ఆంధ్ర):నీట్ పేపర్ లీకేజ్ నిరసిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న వారిపట్ల బీజేపీ ప్రభుత్వం దీక్ష భగ్నం పార్లమెంటు ముట్టడి సందర్భంగా లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అల్తాఫ్ ఆత్రం నగేష్ లు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యార్థి యువతల పట్ల లాఠీ చారి చేసిందని దీన్ని అన్ని వర్గాల వరకు ఖండించాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న కేంద్ర విద్యా శాఖ మంత్రిని తక్షణమే మంత్రివర్గం నుండి భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. 30 రోజులుగా దీక్షలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలవకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే విద్యాశాఖ మంత్రిని తొలగించాలని అదేవిధంగా ఎన్ టి ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా లాఠీచార్జిలో అసాంఘిక శక్తులు చేరబడి లాఠీచార్జి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నీట్ పేపర్ లీకేజ్ బాధ్యులను కఠినంగా శిక్షించాలని దీక్ష చేస్తున్న వారి దీక్ష వద్దకు వెళ్లి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్త ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 24న జరిగే రాష్ట్ర బంద్ లో అన్ని వర్గాల వారు పాల్గొని మద్దతు ఇవ్వాలని రాష్ట్ర కమిటీగా వారి పిలుపునిస్తుంది. కార్యక్రమంలో ఇట్లు ఆదిలాబాద్ జిల్లా కమిటీ, షేక్ అల్తాఫ్ జిల్లా అధ్యక్షుడు, ఆత్రం నాగేష్ జిల్లా కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినోను సమిష్టిగా ఎదుర్కొందాం

**- అదనపు కలెక్టర్ శ్రీజ**

**- ఎల్ నినోపై మండలస్థాయి సమీక్ష**

ఏన్కూరు, జూలై 22(విజన్ ఆంధ్ర): ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను సమిష్టిగా ఎదుర్కొందామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పొదిశెట్టి శ్రీజ అన్నారు. బుధవారం ఏన్కూరులోని రైతువేదికలో ఎల్ నినో ప్రభావంపై మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ శ్రీజ హాజరై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం తక్కువగా నమోదవుతున్న వేళ రైతులు వరి, మొక్కజొన్న, మిరపలాంటి అధిక నీటి వినియోగ పంటలను సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలైనా కందులు, మినుములు, పెసర్లు, తృణధాన్య పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, నూనె గింజల పంటలైన నువ్వులు, వేరుశెనగ వంటి పంటలను సాగుచేసి ఈ ఎల్ నీనో ప్రభావం నుంచి బయటపడాలని సూచించారు. పంట కుంటలు తీసుకోవడం వలన రైతులకు పంటలను సాగు చేసుకోవడానికి, చేప పిల్లల పెంచుకోవడానికి,



భూగర్భజలాలు పెంపొందించుకోవడానికి పంట కుంటలు ఆవశ్యకం అన్నారు. సన్నా, చిన్నకారు రైతులు ఐదు ఎకరాల్లోపు భూమి ఉండి, జాబ్ కార్డు ఉన్న ప్రతి రైతు ఈ పంట కుంటలు తీసుకోవచ్చని తెలియజేశారు. అనంతరం ఎల్ నినో ప్రభావం యొక్క అనుకూల, ప్రతికూల అంశాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోతు లచ్చిరాం నాయక్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పల్లి భాగ్యశ్రీ, మండల వ్యవసాయ అధికారి అవుకు నరసింహారావు, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, ఏపీవో చిత్తలూరి సూరయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల నిర్బంధం నిరంకుశత్వం

**- నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర మంత్రి వెంటనే రాజీనామా చేయాలి**

**- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి**

**- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి**

గజ్వేల్, 22 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : కక్షసాధింపు చర్యల్లో భాగంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీలను అక్రమంగా నిర్బంధించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. దీనికి నిరసనగా మరియు దేశంలో కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న 'నీట్' ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ



సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మరియు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి గార్ల నాయకత్వంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టి, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం యొక్క ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ల చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ విఫల విధానాలను ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని, బిజెపి నిరంకుశ వైఖరికి కాంగ్రెస్ పార్టీ భయపడేదే లేదన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి భవిష్యత్తును 'నీట్' పేపర్ లీకేజీ ద్వారా బిజెపి ప్రభుత్వం బజార్న పెట్టిందని, ప్రశ్నాపత్రాలు లీక్ అవుతుంటే నిద్రపోతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారన్నారు. ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. దేశంలో యువత, విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, అక్రమ నిర్బంధాలకు, కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుఖేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా సంకల్పంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనాతన మహతి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకారం

-నూతన అధ్యక్షురాలిగా ఎం. లయన్ రామారెడ్డి ప్రమాణ స్వీకారం
-సెక్రటరీగా ఏ. శ్రీజా రెడ్డి, కోశాధికారిగా ఎం. సంధ్యారాణి బాధ్యతల స్వీకరణ
-సమాజ సేవే లక్ష్యంగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని నాయకుల హామీ
-ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ జ్యూట్ బ్యాగుల పంపిణీ
-ముఖ్య సలహాదారు జీ.వి. రమణారెడ్డి, లయన్ కోటిరెడ్డి సేవా కార్యక్రమాలకు పిలుపు
-ఘనంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు




కుత్బుల్లాపూర్, జూలై 21 (విజన్ ఆంధ్ర): సమాజ సేవను మరింత విస్తృత స్థాయిలో కొనసాగించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనాతన మహతి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. క్లబ్ సభ్యులు, ఆహ్వానితులు, ప్రముఖుల సమక్షంలో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలిగా ఎం. లయన్ రామారెడ్డి, సెక్రటరీగా ఏ. శ్రీజా రెడ్డి, కోశాధికారిగా ఎం. సంధ్యారాణి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారు లయన్ జీ.వి. రమణారెడ్డితో పాటు క్లబ్ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన లయన్ కోటిరెడ్డి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవా సంప్రదాయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఏడాది విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ రంగాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టి సమాజాభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సనాతన మహతి క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించి, వారి పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సేవా భావంతో సమాజానికి మరింత చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని పలువురు అభిప్రాయపడ్డారు.



## విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం
# నల్లబ్యాడ్జీలతో నిరసన

మందమర్రి, జూలై 22 (విజన్ ఆంధ్ర) : దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని, పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు నోద్నాల శ్రీనివాస్ విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ, ప్రతిపక్ష ఎంపీల అరెస్టులను నిరసిస్తూ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ విగ్రహం ముందు నల్లబ్యాడ్జీలతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్,భీమా మల్లేష్,కూతురు ప్రభాకర్,పట్టణ మాజీ అధ్యక్షుడు పల్లె రాజు,మాజీ జడ్పిటిసి యాకుబ్ అలీ,వనాన రాజయ్య,ఎర్రం విద్యాసాగర్ రెడ్డి,అధికార ప్రతినిధి మొట్టె సుధాకర్, సత్యనారాయణ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- నిందితులను శిక్షించకుండా విద్యార్థులపై దాడులా?
- కేటీఆర్ బినామీ సంస్థపై బీజేపీకి ఎందుకంత ప్రేమ?
- నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ దేశాన్ని దోచుకుంటున్నారు
- కొడంగల్ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ




కొడంగల్, జూలై 22(విజన్ ఆంధ్ర ):నీట్ పేపర్ లీక్ పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవిక దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి, పోలీసుల పాశవిక దాడులపై కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తన నివాసం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టి , స్థానిక అంబేద్కర్ చౌరస్తా లో ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మార్చిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, నీట్ పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అంటూ ప్రశ్నించారు. విద్యార్థినులపై దుర్మార్గంగా దాడి చేయడమే కాకుండా.. విద్యార్థుల తలలు పగలగొట్టారన్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించకుండా పోయారని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? ఎవరైనా కిడ్నాప్ చేశారా అని సందేహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. పాశవిక దాడితో రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందిందని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని చెప్పారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. దేశం కోసం రక్తం చిందించిన గొప్పకుటుంబం ఇందిరమ్మ కుటుంబం అన్నారు. బాంబు దాడితో శరీరం ముక్కలైనా దేశ సమైక్యత కోసం ప్రాణాలిచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని, కనీసం మంత్రి పదవి తీసుకోలేదని తెలిపారు. మన్మోహన్ సింగ్ ను ప్రధాని చేసి త్యాగనిరతిని చాటుకున్న గొప్ప వ్యక్తి సోనియా గాంధీ అని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని గుర్తు చేశారు. ప్రజా స్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని, పేపర్ లీక్ పై పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రధాని అడ్డుకున్నారని విమర్శించారు.

దేశాన్ని దోచుకుంటున్న నరేంద్ర, ధర్మేంద్ర...

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో బీఆరెస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొందన్నారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని గ్లోబరీనా సంస్థ జకీవఎజ్ జుఎబఖ్అశీఃఆ గా పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లింది. ఢిల్లీ బీజేపీ వాళ్లతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చింది. జదీూజు లో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై విద్యార్థులు నిరసన తెలిపారని, ధర్మేంద్ర ప్రధాన్ ను పదవి నుంచి తొలగించకుండా విద్యార్థుల తలలు పగలగొట్టారని కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం తప్పుపట్టారు. నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని, దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు, యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అందరం కలిసి పోరాటం చేసి మోడీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందామని శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు.

అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ..లి

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్ లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఉదయం కొడంగల్ లోని నివాసంలో ఎస్ఐఆర్ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నేరుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్ తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి భారీ ర్యాలీతో కాలినడకన సీఎం అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గ ముఖ్యనాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపులో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- జర్నలిస్టు సంఘం నేత తుమ్మ కృష్ణ**
**- ప్రొఫెసర్ కోదండరాం కు వినతిపత్రం అందజేత**

మర్కుక్ జూలై 22,(విజన్ ఆంధ్ర ) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి,వారి సేవలకు,త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని జర్నలిస్టు సంఘం నేత తుమ్మ కృష్ణ కోరారు.హైదరాబాద్ లో సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమర జ్యోతిలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమంపై, జర్నలిస్టులతో ఉద్యమ గుర్తింపు కమిటీ నిర్వహించిన సంప్రదింపుల సమావేశంలో భాగంగా మంగళవారం రోజు జర్నలిస్టులతో నిర్వహించిన సమావేశంలో తుమ్మ కృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుమ్మ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని,పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని తుమ్మ కృష్ణ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారని,అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాన్ని కోల్పోయారని,అయినప్పటికీ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని



తుమ్మ కృష్ణ తెలిపారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి,ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులందరికీ స్వాతంత్ర సమర యోధులుగా గుర్తించి వారికిచ్చే గౌరవం ఇవ్వాలని,300 గజాల ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని,ప్రైవేటు ఆసుపత్రులలో కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని,55 సంవత్సరాల పైబడిన జర్నలిస్టులందరికీ పింఛన్ అందజేయాలని వారు కోరారు.అనంతరం ఈ వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాంకు వారు అందజేశారు.



## హోటళ్లలో పరిశుభ్రతను పాటించేలా చూడాలి

కుల్కచర్ల, జూలై, 22(విజన్ ఆంధ్ర): హోటళ్లలో పరిశుభ్రతను పాటించేలా చూడాలని కుల్కచర్ల మండల ఎంపీవో భాస్కర్ గౌడ్, కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్ సూచించారు. కుల్కచర్ల చౌరస్తాలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున హోటళ్లలో పరిశుభ్రతను పాటించకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యం భారినపడే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా కల్తీలేని ఆహార పదార్థాలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. హోటళ్లలో ఎప్పటికప్పుడూ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను ఉపయోగించడం ద్వారా ప్రజలకు నష్టం జరిగే అవకాశం ఉందని వివరించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఇష్టారీతిన వ్యవహరిస్తే హోటళ్లను మూసివేయడానికి వెనుకాడబోమని తెలియజేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై దాడి

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

భూపాలపల్లి జిల్లా జులై 22 (విజన్ ఆంధ్ర ) ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసానికి శాంతియుత ర్యాలీగా బయలుదేరిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తీవ్రంగా ఖండించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో భూపాలపల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ తో కలిసి ఎమ్మెల్యే గ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు,నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై ప్రధానమంత్రి నుండి సమాధానం కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుడిపై భౌతికంగా దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను వినిపించేందుకు,యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం కోరేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన అసహన వైఖరిని బయటపెట్టుకుందని విమర్శించారు.దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ విభిన్న అభిప్రాయాలను అణచివేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తున్న రాహుల్ గాంధీ పై జరిగిన ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీ శంకర్ నాయక్ , సిర్ కోఆర్డినేటర్ శ్రీ హుస్సేన్ , భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అంబాల శ్రీనివాస్ , స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జిలతో విద్యుత్ ఉద్యోగుల నిరసనలు




భూపాలపల్లి జిల్లా జూలై 22 (విజన్ ఆంధ్ర ) ఘనపురం మండలం చెల్పూర్ కేటీపీపి ప్రధాన గేటు ముందు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జిలతో నిరసన. వైటీపీఎస్ లో బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను 255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేటీకరణకు అప్పగించే టెండర్ ప్రక్రియను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కేటీపీపీలో టీజీపిఈ జెఏసి పిలుపు మేరకు బుధవారం 26 వ రోజు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడమే కాకుండా, పనిభారం అసమానంగా పెరగడం, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు, బూడిద ప్రైవేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# (35) సంవత్సరాలనుండి వృధాగా పడి ఉన్న బస్టాండ్ పునరుద్ధన చేయాలి - రాష్ట్ర నాయకులు

బాల్కొండ (నిజామాబాదు) జూలై 22:- నిజామా బాదు జిల్లా బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గం లో బస్టాండ్ లోకి గత (35) సంవత్సరాల నుండి బస్సులు రాకుండా వృధాగా ఉందని బస్టాండ్ పునరుద్ధన చేయాలనీ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ యూత్ ప్రాజెక్ట్ యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు వి సత్య గౌడ్, కార్యదర్శి బి.ఆర్. నరసింగ్ రావు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డీ. పవన్ కలిసి తెలంగాణ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ని కోరుతు లేఖ నెం 01/09/ 2024- 25ద2026, తేదీ10 -07 -2026.ఏం. డీ. కి అందించిన ప్రజల వినతి పత్రాలను అందించారు. ఇందుకు సంబదించిన వివరాలు ఇలా ఉన్నాయి.బాల్కొండ బస్టాండును 25-02-1991 పూర్వపు మాజీ రవాణా శాఖ మంత్రి శనిగరం సంతోష్ రెడ్డి చేతుల మీద ప్రారంభించ బడిన బస్టాండ్ (35) సంవత్సరాలనుండి ఉపయోగం లోకి లేకుండా పోయిందని బాల్కొండ ప్రయాణికులు జాతీయ రహదారి రోడ్డు మీదే నిలుచుండి బస్సుల కోసం నిరీక్షణ చేస్తున్నారని వారు వివరించారు.

**" బస్టాండ్ సమస్య ఇలా తీర్చ వచ్చు "**



గత (35) సంవత్స రాలనుండి నుండి వృధాగా పడి ఉన్న బస్టాండ్ లోకి బస్సులు రావాలంటే - నిర్మల్ వైపు నుండి ఆర్మూర్ వైపు వెళ్లే బస్సులు ఎలాగో బై పాస్ దాటుతున్నాయి,అవే బస్సులు నేరుగా హైవే రోడ్డు పైకి పోకుండా నిర్మించిన బస్టాండ్ ముందు ప్రాయాణికుల్ని దింపి వేసి ఎదురుగా ఉన్న "సబ్ వే" రోడ్డు మార్గం ద్వారా వెళ్తు జాతీయ రహదారి వారు నెహ్రూ నగర్ లో నిర్మించిన బస్ షెల్టర్ ద్వారా " హైవే " రోడ్డు పైకి వెళ్ళాలి.ఇలా చేస్తే బాల్కొండ నుండి ఆర్మూర్, నిజామాబాదు కు వెళ్లే ప్రయాణికుల సమస్య తీరుతుంది.అలాగే ఆర్మూర్ వైపు నుండి నిర్మల్ ఆదిలాబాద్ వైపు వెళ్లే బస్సులు అన్ని బస్సులు నెహ్రూ నగర్ లో జాతీయ రహదారి వారు నిర్మించిన బస్ షెల్టర్ ద్వారా జాతీయ రహదారి వారు నిర్మించిన "సబ్ వే" మదర్ థెరిస్సా స్కూల్ ముందు రోడ్డు గుండా వెల్తూ తిరిగి బై పాస్ వద్ద బస్టాండ్ ముందు ఎడమ వైపున ప్రయాణికుల్ని దించి వేసిన అనంతరం అదే రోడ్డు మార్గంలోని బాల్కొండ ఊరు లో ఉన్న "వన్నెల్ ఎక్స్ రోడ్డు" వద్ద 2వ బస్ స్టాప్ గా చేస్తే బాల్కొండ ప్రయాణికుల సమస్య తీరుతుందని ప్రజానీకం అభిప్రాయ పడుతున్నారని వారు ఆర్. టి. సి. అధికారుల్ని కోరుచున్నారు.లేని పక్షంలో ప్రజల చేత ఉద్యమం తప్పదని వారు సూచించారు.

# షెడ్యూల్ ప్రాంతంలో భూమిపై హక్కు ఆదివాసీలకే ఉంది

**-3 జీవోను పునరుద్ధరణ చెయ్యాలి 5వ షెడ్యూల్లో సెక్షన్ 5(2) ప్రకారం ప్రభుత్వం స్పందించి చట్టం చేయాలని డిమాండ్**



వెంకటాపురం జూలై 22( విజన్ ఆంధ్ర) : వెంకటాపురం మండల కేంద్రంలోని రహదారి విశ్రాంతి భవనంలో ఆదివాసి "లా" అసోసియేషన్ ఆధ్వర్యంలో 1/70 చట్టం 3 జీవోను చట్టం చెయ్యాలని అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసి లా అసోసియేషన్ నెంబరు సున్నం రమేష్, చింత సమ్మయ్య, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు యాసం రాజు, రాష్ట్ర కార్యదర్శి మడకం చిట్టిబాబు గొండ్వాన సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర, జిల్లా అధ్యక్షులు పూణెం ప్రతాప్ దొర, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు చింత సోమరాజు, సిద్దబోయిన సర్వేశ్వరరావు, కుచింటి చిరంజీవి. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగం సాక్షిగా ఐదవ షెడ్యూల్ భూభాగంలో పార్లమెంటు చేసిన ప్రభుత్వాలు ఈ పాలక ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, ఆదివాసి జాతి మనుగడను అస్తిత్వాని లేకుండా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ ప్రభుత్వాలు కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతున్నాయని వారన్నారు. ఆదివాసి జాతి అస్తిత్వం కొరకు జాతి సంస్కృతి సాంప్రదాయాలపై మానవతావాదులు, బుద్ధి జీవులు, ప్రజాస్వామిక వాదులు, ప్రొఫెసర్లు పోరాట పటిమను చూపించి ఆదివాసి జాతి పక్షాన నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. ఈలాంటి వ్యక్తులకు ఆదివాసి జాతి కృతజ్ఞులై ఉంటారు అని అన్నారు.ఆదివాసి భూములు అన్యాక్రాంతం కాకుండా ఎల్ టి ఆర్ చట్టం బ్రిటిష్ ప్రభుత్వం చేశారని దానికి సవరణగా గిరిజన భూములు భూ బదలాయింపు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం మరొక్క చట్టాన్ని 1/70 చట్టం ను చేసిన ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతంలో 70% భూమి గిరిజనేతరుల చేతిలో ఉందంటే చట్టాలను పక్క ప్లాన్ తో పక్కదారి మల్లిస్తున్న ప్రభుత్వాలను కూలద్రోయాలని, ఆదివాసి చట్టాలను నిర్వీర్యం, నిర్లక్ష్యం చేస్తూన్న ఈ ప్రభుత్వాలకి ఆదివాసి జాతి పక్షాన బుద్ధి చెప్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ జీవోను పునరుద్ధరణ చేయాలని, ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతంలో సెక్షన్ 5 క్లాస్ 2 ప్రకారం శ్రీ జీవోను చట్టం చేయవచ్చని ప్రభుత్వ స్పందించి ప్రకృతితో సహజ సిద్ధంగా జీవించే ఆదివాసి జాతి జీవితాలలో వెలుగుల నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసి లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 26న వెంకటాపురం కేంద్రంగా అన్ని ఆదివాసి సంఘాల సమక్షంలో వన్ ఆఫ్ సెవెంటీ చట్టంపై శ్రీ జీవో అంశంపై సమావేశ నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళా శక్తి నాయకులు, నయుమా, శంకరమ్మ, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కణితి వెంకటకృష్ణ, కార్యదర్శి సున్నం వంటి, దానమయ్యపేట గ్రామస్తులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ పోలీస్‌స్టేషన్ డీసీపీ తనిఖీ

**సీసీ కెమెరాలు, సైబర్ అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలి**



బెల్లంపల్లి జూలై 22 విజన్ ఆంధ్ర : తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనం స్వీకరించి స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్, రికార్డులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించు కోవాలని, సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన, మత్తు పదార్థాల నిర్మూలన, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీటుబెల్టు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఆపన్నహస్తం..

**- నిరుపేదకు రూ.2.40 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత**
**బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో మంజూరు**
**-అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి వైద్య ఖర్చుల భరోసా**
**-చింతల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎల్ఓసీ పత్రాల పంపిణీ**
**-ప్రజా సంక్షేమమే ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ లక్ష్యమని నాయకుల ప్రశంసలు**
**-అర్హులంతా ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచన**



కుత్బుల్లాపూర్, జులై 22 (విజన్ ఆంధ్ర); ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ, మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆయన చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.2.40 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని సోమవారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అని కొనియాడారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 126వ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌కు చెందిన సంజుల అంజమ్మ భర్త ఎస్. కార్తీక్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.2,40,000 విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు రామకృష్ణ, అభి తదితరులు పాల్గొన్నారు.

# సమృద్ధి వర్షాల కోసం కొత్తకొండలో ఘనంగా వరుణ యాగం - మంత్రి పొన్నం ప్రభాకర్

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

భీమదేవరపల్లి జూలై 22 (విజన్ ఆంధ్ర) : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కాకతీయుల కాలం నాటి ప్రసిద్ధ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వరుణ యాగం, యజ్ఞయాగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, పాడి పంటల సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం కాకతీయుల కాలం నాటి మహిమాన్వితమైన క్షేత్రమని, ఈ ప్రాంత ప్రజలకు అపారమైన



విశ్వాసం ఉన్న దేవస్థానమని పేర్కొన్నారు. వరుణ యాగం నిర్వహించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితుల కారణంగా వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నప్పటికీ, ప్రజలకు భగవంతుడిపై విశ్వాసం ఉందని మంత్రి అన్నారు. అందుకే తెలంగాణ వ్యాప్తంగా అనేక దేవాలయాల్లో వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వర్షాల కోసం ప్రార్థనలు చేస్తున్నారని తెలిపారు. తాను హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా బోనాల ఉత్సవాల సందర్భంగా అక్కడి ఆలయాల్లో కూడా అమ్మవారిని దర్శించుకుని రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగం ద్వారా తెలంగాణతో పాటు దేశమంతా సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



# రాజ్యాంగ హక్కులకు విరుద్ధం

వాజేడు,జూలై22(విజన్ ఆంధ్ర): చింతూరు పంచాయతీలో ప్రభుత్వ జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ వర్గానికి కేటాయించిన అంగన్వాడి టీచర్, వర్కర్ పోస్టులను కొందరు గిరిజన సంఘాలు వ్యతిరేకించడం రాజ్యాంగ విరుద్ధమని టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్.వెంకట నరసయ్య అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ కాల్వంపల్లి సత్యనారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగ అవకాశాలు పొందుతున్న ఎస్సీ వర్గానికి కేటాయించిన అంగన్వాడీ పోస్టులను రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ విషయమై వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. త్వరలో ములుగు కలెక్టర్ కి కూడా వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ కోట నరేందర్, వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ములకల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# కవిత సమక్షంలో పార్టీలో చేరిన సిపిఎం నాయకుడు

ఆళ్లపల్లి 22 , విజన్ ఆంధ్ర : కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మండల పరిధిలోని మర్కోడ గ్రామానికి చెందిన సీనియర్ సిపిఎం నాయకుడు ముసల రామకృష్ణ హైద్రాబాద్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చేరిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేస్తామని ముసల రామకృష్ణ తెలిపారు.

ఒక సీనియర్ లెఫ్ట్ నాయకుడు పార్టీలో చేరడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ రక్షణ సేన పార్టీకి మరింత బలం చేకూరినట్లు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# కవిత సమక్షంలో పార్టీలో చేరిన సిపిఎం నాయకుడు

ఆళ్లపల్లి 22 , విజన్ ఆంధ్ర : కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మండల పరిధిలోని మర్కోడ గ్రామానికి చెందిన సీనియర్ సిపిఎం నాయకుడు ముసల రామకృష్ణ హైద్రాబాద్ లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చేరిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేస్తామని ముసల రామకృష్ణ తెలిపారు. ఒక సీనియర్ లెఫ్ట్ నాయకుడు పార్టీలో చేరడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ రక్షణ సేన పార్టీకి మరింత బలం చేకూరినట్లు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చుకున్న అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి

## - అంగన్‌వాడి కేంద్రానికి నిత్యావసర వస్తువులు
## - చిన్నారులకు విద్యాసామగ్రి, ఆటవస్తువుల పంపిణీ



చేవెళ్ల, జూలై 22 (విజన్ ఆంధ్ర) : సమాజ సేవనే తన బాధ్యతగా భావిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి బుధవారం తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకున్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపల్లి వార్డులోని అంగన్‌వాడి కేంద్రంలో చేవెళ్ల మండల బిఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ జహేద్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి చిన్నారులకు ఆటవస్తువులు, విద్యాసామగ్రి, స్కూల్ బ్యాగులు, పలకలు తదితర వస్తువులను అందజేశారు. అలాగే అంగన్‌వాడి కేంద్రానికి అవసరమైన పలు నిత్యావసర వస్తువులను అందించారు. కేంద్రానికి వచ్చిన గర్భిణీలు, బాలింతలకు పండ్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నతనం నుంచే సేవాభావాన్ని అలవర్చుకున్న అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి గతంలోనూ అనాథ పిల్లలు, వృద్ధులు, నిరుపేద కుటుంబాలు, విద్యార్థులకు తనకు తోచినంతగా సహాయ సహకారాలు అందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పుట్టినరోజును ఆడంబరాలకు దూరంగా ఉంచి సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగన్నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, భవాని, శ్రీనాథ్ రెడ్డి, మౌనిక, శ్రీమాన్ రెడ్డి, శ్రీనికేత్ రెడ్డి, వీహ, మహమ్మద్ యాసిన్, హనుమంతు, మహిపాల్ రెడ్డి, అంగన్వాడి టీచర్ యు. రాజమణి, ఏఎల్ఎంఎస్సి గ్రామ సంఘం అధ్యక్షురాలు ఎన్ను మహేశ్వరి, కోశాధికారి శిరీష, సభ్యులు ఎర్రవల్లి ప్రేమలత, పుష్ప, మౌనిక, నవ్య, రేణుక, నికిత, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య గొంతుకను నొక్కే ప్రయత్నం బిజెపి పార్టీ ఎప్పటికీ సహించదు

## - బిజెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్



విజన్ ఆంధ్ర కేశంపేట 23 భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన సందర్భంగా బి జెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్షాలకు రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును కాలరాస్తూ వ్యవహరిస్తున్న అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. రాహుల్ గాంధీ అనుచిత వాక్యాలపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్ వైఖరి నిరసిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు పూర్తిగా శాంతియుతంగా నెలకొన్నదని పేర్కొన్నారు. బిజెపి నాయకులను కార్యకర్తలను ముందుగా అరెస్టులు చేయడం ప్రజలకు పోలీసు వ్యవస్థను రాజకీయంగా వాడుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన హామీలలో ఒకటి కూడా నెరవేరకపోవడం దుర్మార్గమని తెలిపారు. రైతులకు నిరుద్యోగులకు యువతకు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొంటుందని అన్నారు

# మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం: ఏఐటీయూసీ ఆందోళన

బెల్లంపల్లి జులై 22 విజన్ ఆంధ్ర : సింగరేణి సంస్థ మనుగడ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అన్ని ట్రేడ్ యూనియన్లు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శాంతిఖని గనిపై మంతెన రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జూలై 17, 18 తేదీల్లో నిర్వహించిన మెడికల్ బోర్డు ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, కేవలం 24 మంది కార్మికులను మాత్రమే మెడికల్ ఇన్‌వాలిడేషన్ చేయడం వల్ల అనేక కుటుంబాలు నష్టపోయాయని ఆరోపించారు. గత 17 నెలలుగా మెడికల్ బోర్డులను నిర్వహించకపోవడం కూడా కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించి, అర్హులైన కార్మికులకు మెడికల్ ఇన్‌వాలిడేషన్‌తో పాటు వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. తాడిచెర్ల-2 గనిని సింగరేణికి అప్పగించడంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేసిన కృషిని అభినందిస్తూ, సర్వే పూర్తయిన 15 కొత్త బొగ్గు గనులను కూడా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సమ్మె నోటీసులోని అన్ని డిమాండ్లను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని కోరారు. సింగరేణి భవిష్యత్తు కోసం అన్ని యూనియన్లు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంతెన రమేష్, రత్నం ప్రవీణ్, దాడి రమేష్, రత్నం ఐలయ్యతో పాటు మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## - బెల్లంపల్లిలో కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం



బెల్లంపల్లి, జూలై 22 విజన్ ఆంధ్ర : భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అనంతరం భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను సమీక్షించి పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

తర్వాత సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ప్రజల దరఖాస్తులు జాప్యం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం కాసిపేట మండల తహసీల్దార్ సునీల్, సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌తో కలిసి కాసిపేట ప్రాంతంలో ప్రతిపాదిత సింగరేణి నూతన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే తాండూర్ మండల తహసీల్దార్ జ్యోత్స్న, గోలేటి ఏరియా జనరల్ మేనేజర్‌తో కలిసి తాండూర్ ప్రాంతంలోనూ స్థల పరిశీలన నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన



**- నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

బెల్లంపల్లి, జూలై 22 విజన్ ఆంధ్ర : రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. ముందుగా కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిరసన ప్రదర్శన నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాలపై, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి సూచనలతో కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీపాక రాజేష్ సమక్షంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నిరసనలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ శారద, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హరి యూనివర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మ్యాంగో దినోత్సవం

**- ముఖ్యఅతిథిగా హాజరైన కళాశ్రీ ఉజ్జ్వలనాథ్ పద్మశ్రీ అల్హాజ్ కలీముల్లా ఖాన్(మ్యాంగో మాన్ ఆఫ్ ఇండియా).**

నందిగామ:జులై 22(విజన్ ఆంధ్ర న్యూస్); అంతర్జాతీయ మ్యాంగో దినోత్సవాని పురస్కరించుకుని నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతి వనం లోని హార్టెఫుల్ నెస్ ఆకాడమి ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్

(హరి డీమేడ్ టు బి యూనివర్సిటీలో అంతర్జాతీయ మ్యాంగో దినోత్సవాని హరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నర్సిరెడ్డి మల్లిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కళాశ్రీ ఉజ్జ్వలనాథ్ పద్మశ్రీ అల్హాజ్ కలీముల్లా ఖాన్(మ్యాంగో మాన్ ఆఫ్ ఇండియా) హాజరైయ్యారు. ఈ సందర్భంగా అల్హాజ్ కలీముల్లా ఖాన్ మాట్లాడుతూ ఒకే మామిడి చెట్టుకు అంట్లు కట్టే (గ్రాఫ్టింగ్) పద్ధతి ద్వారా మామిడి పండ్లను పండించే విధానాన్ని మరియు ఒకే చెట్టుపైన వందలాది రకాల మామిడి కొమ్మలను అంట్లు కట్టె విషయాన్ని,మరియు ఈ చెట్టు నుండి రకరకాల రకాలు,ఆకారాలు, రంగులు కలిగిన మామిడి పండ్లు కాస్తాయి అని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం హరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నర్సిరెడ్డి మల్లిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ మరియు హార్టికల్చర్ లో ఉన్న నూతన సాంకేతిక పద్ధతులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా విద్యార్థులు వివిధ రంగాలలో దిగుబడిని,నాణ్యతను పెంచడానికి ఆధునిక సాంకేతికతలు,నూతన అంశాలను తెలుసుకోవాలని,సమాజంలో ఉన్న వ్యవసాయ నిపుణుల ద్వారా గ్రాఫ్టింగ్ పద్ధతులను విద్యార్థులు ప్రాక్టికల్ క్నోలెడ్జి

ద్వారా తెలుసుకొని వాటిమీద దృష్టి పెట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై ఎన్. రెడ్డి,రామలింగ రెడ్డి,రాజీ రెడ్డి,వెంకట్ రెడ్డి,కిరణ్మయి రెడ్డి,అనూష,ప్రియశీక,నవ్య, నరసింహం,మౌనిక,మేఘన,అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక సౌకర్యాలతో స్కూల్ నిర్మాణం...

బోధన్, జులై 22(విజన్ ఆంధ్ర) : కుల మతాలకు అతీతంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో 200కోట్ల రూపాయలతో బోధన్ పట్టణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని బెల్లాల్ ప్రాంతంలో నూతన ఇన్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్న పనులను ఈఎంసి గణపతి రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ విజయకుమారి లతో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 200కోట్ల రూపాయలతో 20ఎకరాల స్థలంలో పాఠశాల నిర్మాణం చేయబోతున్నట్లు తెలిపారు. 2,500మంది విద్యార్థుల కోసం నిర్మించతలపెట్టే ఈ పాఠశాలలో ఉండి చదువుకునే విద్యార్థులు, భోధించే ఉపాధ్యాయుల కోసం ఇక్కడే అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు ఆట స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు.



ముందుగా పట్టణంలోని రోడ్డు భవనాల శాఖ అతిథిలో గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాము, మాజీ అధ్యక్షులు పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# దేవాలయ అభివృద్ధికి రూ.51 వేల విరాళం

**అందజేసిన అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి**

**- మల్కాపూర్‌లోని శ్రీ భువనేశ్వరి సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు**

చేవెళ్ల, జూలై 22 (విజన్ ఆంధ్ర) : దేవాలయాల అభివృద్ధి ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని చేవెళ్ల కు చెందిన సామాజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి అన్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధి మల్కాపూర్ వార్డులో శ్రీ భువనేశ్వరి సమేత మల్లికార్జునస్వామి దేవాలయాన్ని సందర్శించిన ఆయన ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారంగా రూ.51 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కిట్టు ప్రత్యేక పూజలు నిర్వహించి జగన్నాథ్ రెడ్డికి వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధిలో తను భాగస్వామిగా అవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. దాతల సహకారంతో దేవాలయాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు జగన్నాథ్ రెడ్డి తెలిపారు. అనంతరం



గ్రామ పెద్దలు జగన్నాథ్ రెడ్డిని అభినందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, భవాని, శ్రీనాథ్ రెడ్డి, మౌనిక, శ్రీమాన్ రెడ్డి, శ్రీనికేత్ రెడ్డి, వీహ, గ్రామస్తులు మహమ్మద్ మోసిన్, దేవుని రాములు, లింగం, నాగభూషణం, పురుషోత్తం, శర్వలింగం, రవికుమార్ (ఆర్.కె), చామంతి శివరాజ్, సామ మాణిక్య రెడ్డి, ఆంజనేయులు గౌడ్, మహమ్మద్ యాసిన్, జాహేద్, హనుమంతు తదితరులు ఉన్నారు.

# ప్రధాని నివాసం ముట్టడి కుట్రపూరిత వైఖరిపై బీజేపీ ధర్నా

**- బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 22 : ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముట్టడికి కాంగ్రెస్, ఇండియా కూటమి కుట్రపూరిత వైఖరి,కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిరసనగా స్థానిక బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రోజున సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బిజెపి శ్రేణులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అనంతరం బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ,దేశ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి చేసిన ప్రయత్నం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. ప్రజల మద్దతు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతులను విస్మరించి రాజకీయ లబ్ధి కోసం అశాంతిని సృష్టించే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. దేశ భద్రత, అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రధానమంత్రి మోదీ గారిపై వ్యక్తిగత దాడులు చేయడం,ఆయన నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయ కుట్రలతో కాలం గడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధమైన విధానాలను, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న



అరాచక రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు విద్యార్థుల ముసుగులో ఇలాంటి దుశ్చార్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదని ప్రజలు కాంగ్రెస్ నాటకాలు గమనిస్తున్నారని భవిష్యత్ లో కర్రుకాల్చి వాత పెట్టడం కాయమన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ వైఖరికి వ్యతిరేకంగా పొన్నం ప్రభాకర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం,నాయకులు మాచర్ల కుమారస్వామి, పైడిపల్లి పృద్విరాజ్, నునవత్ మోహన్ నాయక్, లక్కిరెడ్డి తిరుమల,తోట స్వరూప, కుంట స్వప్న,జనగామ వేణుగోపాల్ రావు,బీజేపీ అధ్యక్షులు బుక్యా సంపత్ నాయక్, రామంచ మహేందర్ రెడ్డి, జాలిగం రమేష్, పోలోజు సంతోష్, దంచానాల శ్రీనివాస్, మంతుర్తి శ్రీకాంత్, శ్రీరామోజు శ్రీనివాస్, కృత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# దాహం తీర్చిన సర్పంచ్ చొరవ

**- గాదిగూడ ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం**

**- విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకుని చేతి పంపు ఏర్పాటు చేసిన సర్పంచ్ ఆడ చంద్రకళ--రాజేశ్వర్**

గాదిగూడ, జూలై 22(విజన్ ఆంధ్ర):గాదిగూడ మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో తాగునీరు అందుబాటులో లేక విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న గాదిగూడ గ్రామ సర్పంచ్ ఆడ చంద్రకళ రాజేశ్వర్ వెంటనే స్పందించారు. సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి ఆలస్యం చేయకుండా పాఠశాల ఆవరణలో చేతి పంపు ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థులకు తాగునీరు అందుబాటులోకి వచ్చి సమస్యకు తక్షణ ఉపశమనం లభించింది.సర్పంచ్ తీసుకున్న చొరవపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులు ఇదే తరహాలో స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం.



దౌల్తాబాద్ 22 (విజన్ ఆంధ్ర ) : రాహుల్ గాంధీ అనుచిత ప్రవర్తనను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన బీజేపీ శ్రేణులను పోలీసుల ద్వారా అడ్డుకోవడం కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి నిదర్శనం. పోలీసులను అడ్డుపెట్టుకుని తెలంగాణలో బీజేపీ గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదు. నీట్ అంశంపై ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంట్లో చర్చకు సిద్ధంగా ఉన్నా.. రాజకీయ మనుగడ కోసమే కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా డ్రామాలు ఆపి పార్లమెంట్ సజావుగా జరిగేలా సహకరించాలి. అరెస్ట్ చేసిన రామచందర్ రావు తో పాటు ఇతర బీజేపీ నాయకులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలి! సతీష్ ముదిరాజ్ బిజెపి మాజీ మండల అధ్యక్షుడు దౌల్తాబాద్ మండలం

# ఆగస్టు 1న నిర్వహించే మహాధర్నాకు భారీగా తరలిరండి

**- టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి గణపురం సురధీర్**



చేవెళ్ల, జూలై 22 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి గణపురం సురధీర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు చేవెళ్ల మున్సిపల్ పరిధి మల్కాపూర్ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి (ఎంఈవో) పురందాస్ హాజరై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణపురం సురధీర్ మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు పూర్తైన నేపథ్యంలో 51 శాతం ఫిట్ మెంట్‌తో కొత్త పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విడుదలైన డీఎస్సీ-2003 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నట్లే తెలంగాణలోనూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనాలు చెల్లిస్తూ ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మోర లక్ష్మణ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, హరిశంకర్ గౌడ్, మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్లినిక్ ఒకరిది వైద్యం మరొకరిది

**జిల్లా కేంద్రంలో ఆగని నకిలీ వైద్యుల దందా**







నిజామాబాద్ జూలై22:( విజన్ ఆంధ్ర ) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నకిలీ వైద్యులపై ఉక్కు పాదం మోపుతున్న వారి ఆగడాలు ఆగడం లేదు. ఏకంగా జిల్లా కేంద్రంలోనే నకిలీ వైద్యురాలి నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఓ పేరు మోసిన సీనియర్ వైద్యుని పేరిట కొనసాగుతున్న క్లినిక్ లో నకిలీ వైద్యురాలు రోగులను పరీక్షించడం విస్మయానికి గురిచేసింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్ ప్రాంతంలో గల భారత్ క్లినిక్ లో కృష్ణమూర్తి సుదీర్ఘకాలంగా వైద్యశ్రీ అందిస్తున్నారు. ఆ వైద్యునికి వయస్సు పై బడటంతో విశ్రాంతి నిమిత్తం ఇంటికే పరిమితమయ్యారు. అయితే ఆ క్లినిక్ ను నడుపుతున్న వైద్యుని కుమారుడు తన తండ్రి స్థానంలో అఖిల అనే మరో వైద్యురాలితో క్లినిక్ ను కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే నకిలీ వైద్యం దందా కొనసాగుతున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ఓ సీనియర్ వైద్యుని పేరిట మరొకరు వైద్యం నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని వైద్యాధికారులే వెల్లడించారు. కానీ వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పై ఉందని చెప్పడం కొసమెరుపు. దీనిని బట్టి పెద్ద ఎత్తున ఈ క్లినిక్ నుండి ముడుపులు అందడం వల్లే ఇటువైపు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి క్లినిక్ లపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# చినుకుకే చిత్తడిగా రాజులగూడ రహదారి

**- అధ్వానంగా మారిన గ్రామానికి వెళ్లే దారి**

**- పట్టించుకోని అధికారులు..**

**- రోడ్డు మరమ్మతు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి**





గాదిగూడ,జులై22(విజన్ ఆంధ్ర): చిన్నపాటి వర్షానికే గాదిగూడ మండల కేంద్రంలోని లోకారి(కె) గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రాజులగూడ గ్రామానికి వెళ్లే రహదారి బురదమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై మట్టి పేరుకుపోవడంతో వాహనాలు జారిపడే పరిస్థితి నెలకొంది.కాలినడకన వెళ్లే ప్రజలు,విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతున్నప్పటికీ సంబంధిత గ్రామపంచాయతీ,మండల అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఇతర వాహనాలు గ్రామానికి చేరుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.రహదారిని వెంటనే మరమ్మతు చేసి గ్రావెల్ వేయడంతో పాటు శాశ్వతంగా బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# చౌటకూర్ రైతు వేదికలో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలపై మండల స్థాయి సమీక్ష సమావేశం

**- అధికారులకు స్పెషల్ ఆఫీసర్ మార్గదర్శకాలు ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి మాట్లాడుతూ**



చౌటకూర్ జూలై 22 (విజన్ ఆంధ్ర):- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల పురోగతిపై బుధవారం చౌటకూర్ మండలం కేంద్రంలో రైతు వేదికలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో గ్రామస్థాయిలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్యం, పల్లె అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ లక్ష్యాల సాధన తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలోని కార్యక్రమాల పురోగతి వివరాలను నివేదించారు.అధికారులకు స్పెషల్ ఆఫీసర్ మార్గదర్శకాలు ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను నిర్దేశించిన గడువుల్లో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, పురోగతి నివేదికలను ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ సువర్ణ, డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మరియు వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన కార్యాచరణపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**పుల్కల్ మండల కేంద్రంలో విద్యాసంస్థలు బాయ్ కాట్**

**బస్వాపూర్ చౌరస్తాపై ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ధర్నా చేసిన కాంగ్రెస్ నాయకులు**

చౌటకూర్ జూలై 22 (విజన్ ఆంధ్ర):- మండల కేంద్రం పుల్కల్ లో ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు విద్యాసంస్థలు బంద్ చేయించి బస్వాపూర్ చౌరస్తాపై విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎన్ ఎస్ యు ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నిరంజన్ మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు అక్రమంగా విద్యార్థులపై లాఠీచార్జి చేసి విద్యార్థులకు సపోర్టుగా సానుభూతి తెలుపడానికి వచ్చిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ ధర్నా చేస్తున్నట్టు నిరంజన్ తెలిపారు విద్యార్థుల భవిష్యత్తును ఖరాబు చేయడమే కాక వారిని మానసికంగా ఇబ్బంది పెట్టి న్యాయంగా ధర్నా చేస్తున్న వారిపై లాఠీచార్జి చేసినందుకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలని మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఏట్టి శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మన్నె విటల్, యేసు, నర్సింలు, వీరేశం, ఎన్ ఎస్ యు ఐ నాయకులు ప్రేమ్ కుమార్, ప్రవీణ్, వినయ్, మధు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోజ్...దేశ ద్రోహుల పార్టీ

**- నీట్ పేరుతో దేశ వ్యతిరేక కలాపాలు**

**- ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజల్ని రెచ్చగొడుతున్నారు...**

**- రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం....**



నిజామాబాద్ జూలై22:( విజన్ ఆంధ్ర )కాక్రోజ్ పార్టీ, దానికి మద్దతు తెలుపుతున్న పార్టీలు, నాయకులు దేశద్రోహ కార్యకలాపాలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రధాని నివాసం వద్ద అరాచకం సృష్టించిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బుధవారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఒకప్పుడు ఆప్ పార్టీ సోషల్ మీడియా వాలంటీర్ గా పని చేశాడని గుర్తు చేశారు. ఒకవైపు ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రహానికి నిలబడితే, కాంగ్రెస్ మాత్రం అధికారం కోసం అరాచక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దేశ ప్రధాని మోదీ అభివృద్ధి పాలన చూడలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. కాక్రోచ్ పార్టీకి మద్దతు తెలుపుతున్న నాయకులంతా దేశద్రోహులేనని ధ్వజమెత్తారు. దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్ చుగ్ గతంలో జాతీయ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టడంతో, ఆయనపై జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదయిందని తెలిపారు. కాక్రోచ్ పార్టీకి మద్దతు తెలిపే ప్రతి ఒక్కరూ బంగ్లాదేశ్ కి పాకిస్తాన్ కి మద్దతు తెలుపుతూ దేశ వ్యతిరేకులుగా మిగిలిపోతున్నారన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్, అద్దంకి దయాకర్, ప్రకాష్ రాజ్.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది హిందూ వ్యతిరేకులు ఏకమవుతున్నారని చెప్పారు. నీట్ పరీక్ష పేరుతో ఢిల్లీలో అరాచకం సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నీట్ లీకేజీ పై కేంద్ర ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యార్థుల పాఠ్యాంశాల్లో అక్బర్, ఔరంగజేబు వంటి వారి చరిత్రను తొలగించినందుకా అని అన్నారు. అంతకు ముందు పోలీసులు దిష్టి బొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో కొంత తోపులాట జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కార్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, ఇప్పకాయల కిషోర్, చింతకాయల రాజేందర్, బెల్లాల్ శశాంక్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, న్యాలం సునీత రాజు, బంటు ప్రీతి ప్రవీణ్, మండలాధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

**ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం సూచన.**

**సీబీసీ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం.**

నిజామాబాద్, జూలై22:( విజన్ ఆంధ్ర) : మాధక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఈగల్ ఫోర్స్ డీఎస్పి సోమనాథం సూచించారు.

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), నిజామాబాద్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా బుధవారం గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈగల్ ఫోర్స్ డీఎస్పి ఎం. సోమనాథం నిజామాబాద్ మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మంచి స్నేహాలను ఎంచుకుని విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, కఠిన అమలు చర్యలను సమర్థవంతంగా కొనసాగిస్తోందని తెలిపారు. కేవలం సరదాగా మాదకద్రవ్యాలను ఒకసారి వినియోగించినా అది వ్యసనానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఐదు నుంచి ఏడు సంవత్సరాలను విద్య, నైపుణ్యాభివృద్ధికి అంకితం చేసి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని, సానుకూల స్నేహ వాతావరణాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి రాయబారులుగా మారాలని పిలుపునిచ్చారు. తోటి వారి ఒత్తిడికి లొంగకుండా కుటుంబ సభ్యులు, సమాజంలో అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రతీ ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ సాధనలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని కోరారు.

శివచరణ్ రెడ్డి, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, సీబీసీ, నిజామాబాద్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై యువతలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి ఆచరణలో పెట్టి నషా ముక్త్ భారత్ అభియాన్ విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈగల్ ఫోర్స్ సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా సమకూరే నిధులు నేర, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించబడుతున్నాయని తెలిపారు. డ్రగ్ మాఫియా ప్రధానంగా యువతనే లక్ష్యంగా చేసుకుంటుందని, అందువల్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా సాంగ్ అండ్ డ్రామా బృందం ప్రదర్శించిన పల్లె సుద్దులు జానపద కళారూపం ద్వారా నషా ముక్త్ భారత్ అభియాన్ సందేశాన్ని ఆకట్టుకునే రీతిలో ప్రజలకు చేరవేసింది.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు శ్రీమతి నహీదా బేగం, అధ్యాపకులు, శ్రీ మోహన్ దాస్, ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్, ఆకాశవాణి తో పాటు 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# వానాకాలం అత్యవసర పంటల ప్రణాళికపై నేడు అవగాహన సదస్సు

చేవెళ్ల, జూలై 22 (విజన్ ఆంధ్ర): వానాకాలం 2026లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు అనుసరించాల్సిన అత్యవసర (కాంటింజెన్సీ) పంటల ప్రణాళికపై అవగాహన కల్పించేందుకు మండల స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... నేడు గురువారం ఉదయం 11 గంటలకు చేవెళ్ల రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని రైతులతో పాటు వివిధ శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పీఏసీఎస్, మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

# నేటి నుండి టెట్ కు దరఖాస్తుల ప్రక్రియ



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 22 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి):సర్కార్ బడుల్లో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యా యుల కోసం ప్రత్యేకంగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ టెట్ నోటిఫికేష న్ రిలీజ్ అయింది. దీనికి సంబంధించి బుధవారం నుంచి ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నది ఈ నెల 29 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం కల్పించా రు ఈ వివరాలను ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలాస్,టెట్ కన్వీనర్ జి రమేష్, వెల్లడించారు. ఈ టెట్ పరీక్షను కంప్యూటర్ ఆధారిత ఆన్లైన్ విధానంలో సి బి టి,మొత్తం రెండు పేపర్లుగా నిర్వహిస్తా రు. 1 నుండి 5 తరగ తులకు బోధించే ఎస్ జి టి,లు అండ్ ఎల్ ఎఫ్ ఎల్ , హెచ్ఎంలు పేపర్-× రాయవలసి ఉ ౦డగా.. 6 నుండి 8 తరగతులకు బోధించే స్కూల్ అసిస్టెంట్లు, టి జి టి,లు, లాంగ్వేజ్ పండిట్లు, హైస్కూల్ హెచ్ఎం లు పేపర్-×× పరీక్ష రాయాలి. ఈ పరీక్ష లో ప్రతి పేపర్ 150 మార్కులకు 150 బహుళ ఐచ్ఛిక ప్రశ్నల ఎం సి క్యూ రూపంలో ఉంటుంది. అయితే ఇందులో ఎలాంటి నెగెటివ్ మార్కులు ఉండవు. జనరల్, బీసీ కేటగిరీ అభ్యర్థులకు ఒక పేపర్కు రూ.750/-, రెండు పేపర్లకు రూ.1000/- రుసుము నిర్ణయించ గా. ఎస్సీ ఎస్టీ, పిడబ్ల్యుడి అభ్యర్థు లకు ఒక పేపర్కు రూ.700/-, రెండు పేపర్లకు రూ.950/- గా నిర్ణయించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి జనరల్ ఈ డబ్ల్యు ఎస్ అభ్యర్థులకు 60% అంతకంటే ఎక్కువ, బీసీ అభ్యర్థులకు 50% అంతకంటే ఎక్కువ, ఎస్సీ ఎస్టీ/వికలాంగ అభ్యర్థులకు 40% అంతకంటే ఎక్కువ మార్కులు రావలసి ఉంటుంది. అర్హత కలిగిన ఉపాధ్యాయులు 2026 జులై 22 నుండి జులై 29 వరకు విద్యాశాఖ అధికారిక వెబ్సైట్ https://schooledu.telangana.gov.in ద్వారా ఆన్లైన్లో ఫీజు చెల్లించి దరఖా స్తులు సమర్పించ వచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థు లు 2026 ఆగస్టు 31 నుండి తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చు.

పరీక్షలు సెప్టెంబర్ 07 నుండి సెప్టెంబర్ 11 వరకు రోజుకు రెండు విడతల్లో ఉదయం 9.00 నుండి 11.30 వరకు, మధ్యాహ్నం 2.00 నుండి 4.30 వరకు) నిర్వహిస్తారు. 2026 సెప్టెంబర్ 28 నుండి సెప్టెంబర్ 30 మధ్య ప్రకటిస్తారు. దరఖాస్తు సమయం లో ఎలాంటి సందేహా లు ఉన్నా నివృత్తి చేసుకోవడానికి విద్యాశాఖ హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్లు 7093958881 అందుబాటులో ఉంచింది.

# నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో గుప్తనిధుల కలకలం

**- మామిళ్లపల్లి పురాతన ఆలయం వద్ద అర్ధరాత్రి తాంత్రిక తవ్వకాలు**

**- 6 అడుగుల గుంత, తాయత్తులు లభ్యం - ఆలయ పవిత్రతకు భంగం**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 22 (విజన్ ఆంధ్ర): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో గుప్తనిధుల పేరుతో జరిగిన అక్రమ తవ్వకాలు పెద్ద దుమారం రేపాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన శివాలయం సమీపంలో సోమవారం రాత్రంతా జరిగిన ఈ తవ్వకాలతో గ్రామమంతా భయాందోళనకు గురైంది. గుప్తనిధులు ఉన్నాయనే మూఢనమ్మకంతో కొందరు అర్ధరాత్రి వచ్చి ఆలయ పరిసరాలను అపవిత్రం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

గ్రామ శివారులో ఉన్న శతాబ్దాల నాటి పురాతన శివాలయం వద్ద సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము వరకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు ఆలయానికి 50 మీటర్ల దూరంలో 6 అడుగుల లోతు, 4 అడుగుల వెడల్పు గల భారీ గుంతను చూసి షాకయ్యారు. చుట్టూ చెల్లాచెదురుగా ఉన్న మట్టి దిబ్బలు, దీపాలు, అగరబత్తీల అవశేషాలు కనిపించడంతో వెంటనే గ్రామ పెద్దలకు, పోలీసులకు సమాచారం అందించారు.

సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, గ్రామస్తులు పరిశీలించగా ఇది సాధారణ తవ్వకం కాదని, తాంత్రిక పూజలతో కూడిన గుప్తనిధుల వేట అని స్పష్టమైంది. గుంత వద్ద నల్లని దారంతో కట్టిన తాయత్తులు, రాగి యంత్రాలు, నల్లని గుడ్డ ముక్కలు లభించాయి. అదేవిధంగా పసుపు, కుంకుమ, విబూది, సిందూరం ప్యాకెట్లు, రెండుగా నరికిన గుమ్మడికాయ, నిమ్మకాయలు, కర్పూరం, కాలిన అగరబత్తీలు, నూనె దీపం అవశేషాలు కూడా కనిపించాయి. వీటిని చూసిన గ్రామ పెద్దలు గుప్తనిధులు ఉన్నాయని నమ్మి మంత్రాలు చదివి, బలి ఇచ్చి తవ్వి ఉ ంటారని ఆరోపించారు.

మామిళ్లపల్లి ఆలయానికి 400 నుంచి 500 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఈ ప్రాంతంలో రాజులు నిధులు దాచారనే ప్రచారం గ్రామంలో చాలా కాలంగా ఉ ంది. అదే నమ్మకంతో బయటి వ్యక్తులు వచ్చి ఇలా చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. రాత్రిపూట తమ ఆలయాన్ని అపవిత్రం చేశారని, ఇది దేవుడి స్థలమని, ఇలాంటి వాళ్లను కఠినంగా శిక్షించాలని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో భయం నెలకొంది.

సమాచారం అందుకున్న వెంటనే ఉప్పునుంతల ఎస్ఐ మహేష్ గౌడ్ బృందం సంఘటన స్థలానికి చేరుకుని అన్ని ఆధారాలను స్వాధీనం చేసుకుంది. చుట్టుపక్కల గ్రామాల్లో విచారణ ప్రారంభించడంతో పాటు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలు, టవర్ లొకేషన్లను కూడా పరిశీలిస్తున్నారు. అదే సమయంలో పురావస్తు శాఖ అధికారులకు కూడా సమాచారం ఇచ్చారు. పురాతన కట్టడాల వద్ద ఇలాంటి తవ్వకాలు చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు.

గుప్తనిధుల మూఢనమ్మకంతో పురాతన చరిత్ర కలిగిన ఆలయాలను ధ్వంసం చేయడం తీవ్రమైన నేరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి 24 గంటల రక్షణ ఏర్పాటు చేయాలని, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, గుప్తనిధుల పేరుతో మోసం చేసే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించి దోషులను పట్టుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మామిళ్లపల్లి ప్రజలు కోరుతున్నారు.

## కూకట్‌పల్లి డిపోలో ఎస్ డబ్ల్యూ యు - ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో

# ఘనంగా జండా ఆవిష్కరణ




కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జులై 23: కూకట్‌పల్లి డిపోలో ఎస్ డబ్ల్యూ యు - ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో గౌరవనీయులు పటోళ్ల నాగిరెడ్డి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒడిశాల అబ్రహం, రాష్ట్ర కమిటీ సభ్యులు, డిపో బాధ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పటోళ్ల నాగిరెడ్డి మాట్లాడుతూ, "ఆర్టీసీ మనుగడకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కార్మికులకు అండగా నిలిచారు" అన్నారు. జక్కుల మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, విలీనం అంశంలో జేఏసీ నాయకత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

# పాపిరెడ్డి నగర్‌లో అక్రమ వాటర్ ప్లాంట్ల పై అధికారుల ఉక్కుపాదం సీజ్ చేసి హెచ్చరికలు

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూలై 23: ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ డివిజన్‌లోని పాపిరెడ్డి నగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. నూతన తహసిల్దార్ శరత్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లకు నోటీసులు జారీ చేసి వెంటనే సీజ్ చేశారు.

అక్రమంగా సీజ్ చేసిన ప్లాంట్లను తిరిగి తెరిచి నిర్వహిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ చర్యలతో స్థానిక బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు గత కొంతకాలంగా అక్రమ వాటర్ ప్లాంట్ల తొలగింపునకు చేసిన నిరంతర పోరాటానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి సహకరించిన రెవెన్యూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ఉద్యమంలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రారెడ్డి మాట్లాడుతూ, భూగర్భ జలాలను పరిరక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. భావితరాలకు తాగునీటి వనరులను కాపాడేందుకు అక్రమంగా భూగర్భ జలాలను వినియోగించే వారిపై కఠిన చర్యలు కొనసాగాలని కోరారు. అలాగే పాపిరెడ్డి నగర్‌తో పాటు బస్తీలోని ప్రతి సమస్యను ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ సహకారంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అగస్టిన్, ఆర్. భగవంత రెడ్డి, నరసింహులు ముదిరాజ్, సి.హెచ్. సత్యనారాయణ రెడ్డి, బాల్ రెడ్డి, తాటి కిరణ్, పి. శంకర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్, వీరబాబు, సుజిత్, శివ, ప్రకాష్ రెడ్డి, వసీం, వనం అంజనేయులు, అరుణ లక్ష్మి, లక్ష్మమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు తప్పవు

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జులై 23: ప్రైవేట్ పాఠశాలల పై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా నాయకులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమెకు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. విద్యార్థి సంఘాల పేరుతో, కుల సంఘాల పేరుతో, ఆర్టిఐ యాక్టివిష్టుల పేరుతో పాఠశాల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. డబ్బు వసూలే ప్రధానంగా ఇలాంటివారు పాఠశాలల నిర్వాహకులను ఇబ్బంది చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాజాగా ఉప్పల్ ప్రాంతంలో కొందరిపై కేసులు నమోదు అయినట్లు కూడా ఆమెకు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వసూళ్లకు పాల్పడుతున్నటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి తమకు స్పష్టమైన హామీని ఇచ్చారని వారు ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల నిర్వాహకుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించవద్దని సూచించారు. ఎవరు డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ట్రస్మా సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిరు ఆంజనేయులు, ఉప్పల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, పలు పాఠశాలల కరస్పాండెంట్స్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉపేందర్ తదిత రులు పాల్గొన్నారు.



## నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు స్ప్రింక్లర్ పైపుల పంపిణీ



నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) జూలై 22 బుధవారం : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాడూర్ మండలానికి చెందిన రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు స్ప్రింక్లర్ విధానం ఎంతో ఉపయోగకరమని, దీనివల్ల తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో పాటు పంట దిగుబడులు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి విషయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడూరు ఖ్రుషిం ఛైర్మెన్ రాంచందర్ రెడ్డి , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, సర్పంచ్ లు , ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయం

**- బ్రాంచ్ మేనేజర్ రాముడు**



గద్వాల జూలై 22( విజన్ ఆంధ్ర బ్యూరో) : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు యూబీఐ గద్వాల గాంధీ చౌక్ బ్రాంచ్ మేనేజర్ రాముడు అన్నారు. బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాంధీ చౌక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో "షాప్ టూ షాప్" కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలకు, ఇండ్లకు వెళ్లి తమ బ్యాంకు అందిస్తున్న సేవల గురించి అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ

ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందించడం, ఆర్థిక పరిష్కారాలను తెలియజేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ సందర్భంగా అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు, క్లరికల్ సిబ్బంది, సబార్డినేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వ్యాపార సంస్థలు, గృహాలను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగదారులతో మమేకమై వారి అవసరాలను తెలుసుకొని తగిన బ్యాంకింగ్ ఉత్పత్తులను పరిచయం చేశారు. పొదుపు, కరెంట్ ఖాతాలు, వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, వ్యవసాయ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బీమా, పెట్టుబడి పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సురక్షితమైన, సులభమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎల్డీఎం శ్రీనివాసరావు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం: శేఖర్ మాస్టర్



తెలకపల్లి, జులై 22(విజన్ ఆంధ్ర )నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై న్యాయం కోరుతూ శాంతియుతంగా ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అత్యంత అమానుషమని రాజ్యాంగ రక్షణ దళ్ నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ సభ్యుడు శేఖర్ మాస్టర్ ఖండించారు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు వరుసగా ప్రశ్న పత్రాల లీకేజీలు పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు చోటు చేసుకుంటున్నా కేంద్రం బాధ్యత వహించడం లేదని విమర్శించారు

## నీట్ లీకేజీ, రాహుల్ అక్రమ అరెస్టుపై కాంగ్రెస్ ధర్నా



?పెబ్బేరు జులై22 ( విజన్ ఆంధ్ర) : నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసనగా, ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఎత్తున ధర్నా, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుభాష్ చౌరస్తా వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

? ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని నాయకులు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ధ్వజమెత్తారు. సుభాష్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన ధర్నాతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

"కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు న్యాయం చేయాలి. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి. లేనిపక్షంలో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు అన్నారు.

?ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు యువజన కాంగ్రెస్ సభ్యులు. పట్టణ మరియు మండల పార్టీ ఆధ్వర్యంలో విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

### పంటల వైవిధ్యీకరణతో సుస్థిర వ్యవసాయానికి గ్రామసభల పిలుపు

**-మండల అభివృద్ధి అధికారి**

**- పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణపై గ్రామసభలు**

నంగునూరు మండలంలో అవగాహన కార్యక్రమాలు – రీచార్జ్ వెల్ పిట్లకు మార్కింగ్ పూర్తి నంగునూరు మండలంలోని కొండంరాజ్ పల్లి, ఖాతా, సంతోష్‌నగర్,గ్రామపంచాయతీలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ, వర్షాకాల సన్నద్ధత అంశాలపై రైతులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామసభల్లో మండల అభివృద్ధి అధికారి , వ్యవసాయ అధికారి, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, మండల పంచాయతీ అధికారి, వైద్య శాఖ అధికారులు, గ్రామస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మళ్లించే చర్యల్లో భాగంగా నంగునూరు మండల పరిధిలో రీచార్జ్ వెల్ పిట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను గుర్తించి మార్కింగ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని, రైతులు పంటల వైవిధ్యీకరణను పాటించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగింపు...



బోధన్, జులై 22(విజన్ ఆంధ్ర) : బోధన్ అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధిస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పట్టణంలోని ఆజాం గంజ్ లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మూడు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం బుధవారంతో విజయవంతంగా ముగిసిందని మండల విద్యాధికారి నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులకు సంబంధించిన ఆధునిక బోధనా పద్ధతులు, అభ్యసన ఫలితాల ఆధారిత బోధన, విద్యార్థి కేంద్రిత కార్యకలాపాలు, ప్రాథమిక సామర్థ్యాల అభివృద్ధి వంటి అంశాలపై ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించబడిందన్నారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా నైపుణ్యాలను ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీసం 80 శాతం అభ్యసన సామర్థ్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించి, పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణతో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఆయన కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సంజీవ్, ప్రీతి, సందీప్‌లు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ నాగేష్, సీఆర్పీలు విజయ్, యూసఫ్ లు పాల్గొన్నారు.

## నీట్ అక్రమాలపై కాంగ్రెస్ నిరసన

గోపాలపేట జూలై 22(విజన్ ఆంధ్ర): ఉమ్మడి గోపాలపేట,ఏదుల మండలంలోని కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడం సరికాదని మండిపడ్డారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అవసరమైతే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ కొంకి వెంకటేష్, ఏదుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు పందెం సుఖేందర్, కోళ్ల వెంకటేష్, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ల ప్రేరణాత్మక సందేశం

నిజామాబాద్ జులై22:( విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్, హైదరాబాద్‌లో శిక్షణ పొందిన కామారెడ్డి జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీ రవి తేజ గారు, నిజామాబాద్ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీ సందీప్ గారు ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారికి ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ కార్యక్రమానికి గౌరవనీయ హానరరీ డైరెక్టర్ శ్రీ దేవిదాస్ గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సివిల్ సర్వీసెస్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ ఎంతో అవసరమని సూచించారు. ప్రతి అభ్యర్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అపజయాలను అవకాశాలుగా మలుచుకుని పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకోవచ్చని వివరించారు.
అభ్యర్థులు అందుబాటులో ఉన్న గ్రంథాలయం, అధ్యయన వనరులు మరియు అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రోజువారీ అధ్యయన ప్రణాళికను రూపొందించి క్రమం తప్పకుండా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి, వారి భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు.
విద్యార్థులు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అందించిన మార్గదర్శకత్వం తమకు ఎంతో ప్రేరణనిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

మందమర్రి, జూలై 22 (విజన్ ఆంధ్ర) : గద్దె రాగడి అమ్మ గార్డెన్ ఏరియాలో ఉంటున్న తమ తల్లితండ్రులను చూసేందుకు వచ్చిన కొడుకు సాగర్ (23) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లుగా పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మూత్ర విసర్జన కొరకు బయటకు వెళ్లిన సాగర్ ఎడమ చేతి భుజానికి ఏదో కుట్టినట్లుగా అనిపించిందని చెప్పి ఈ నెల 15 తెల్లవారి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కొరకు వెళ్లారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కొరకు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స పొందుతున్న సాగర్ తేదీ 21 న ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుని తండ్రి ఎర్రయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు.

# నిరసనల పర్వం



కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీల అరెస్టులకు దేశవ్యాప్తంగా నిరసనల పర్వం కొనసాగుతుంది, ఈ సందర్భంగా ట్రాన్సజెండర్ల జరీనా, గంగా గార్ల వారితో పాటు వారి ట్రాన్సజెండర్లందరితో నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టడం జరిగింది. 11 వ డివిజన్ లోని బహుజన కాలని లో డిసిసి కార్పొరేషన్ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్ సమన్వయంతో అంబేద్కర్ చిత్రపటం వద్ద ట్రాన్జెండర్ల కాంగ్రెస్ నాయకులతో నిరసన పాటిస్తూ మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు ప్రజాస్వామ్య వాణిని అణచివేసే ప్రయత్నమే ఈ నిర్బంధమని బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ న్యాయం, జవాబుదారీతనం కోసం సాగే ప్రజాస్వామ్య పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు కొనసాగిస్తుందని, యావత్ కాంగ్రెస్ పార్టీ యువతకు గట్టిగా అండగా నిలుస్తుందని అన్నారు.
మీరు మమ్మల్ని జైల్లో పెట్టవచ్చు, మమ్మల్ని అణచివేయడానికి ప్రయత్నించవచ్చు, కానీ న్యాయం, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న లక్షలాది మంది యువ భారతీయుల ఆగ్రహాన్ని మీరు అణచివేయలేరు," అని అన్నారు. నీట్ (బీజులు) పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలకు నిరసనగా రామకృష్ణ తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా ఒకరి చేతులకు ఒకరు తాడుతో సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, కార్పొరేటర్లు కరీం, అన్వర్, నయీం, మరియు నవాజ్, ముదసిర్, అవీన్ తదితరులు పాల్గొన్నారు

## సర్ ప్రక్రియలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు...



కొత్తకోట జులై 22 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట మున్సిపాలిటీలో దేవరకద్ర నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం నేడు 6వ వార్డు బూత్ నెంబర్ 242 రాఘవేంద్ర కాలనీలో సర్ ప్రక్రియను చేపట్టిన బిఆర్ఎస్ నాయకులు కాలనీలోని సర్ ప్రక్రియ పూర్తి చేసినా వారి ఫామ్లను BLO లకు అందజేశారా లేదా ఇంకా ఇవ్వని వారి కుటుంబ సభ్యుల సమాచారం తెలుసుకుంటూ పెండింగ్లో ఉన్న వారివి ఫామ్లను నింపడం జరిగింది.
నేటి వరకు 6వ వార్డు 242 బూతులో ఓటర్ల సంఖ్య 1311, ఆన్లైన్ చేసినవి 862, దీరా గారికి అందాల్సినవి 116, ఇప్పటి వరకు ఎలాంటి అడ్రస్ లేనివి చనిపోయిన వారి ఓటర్ల సంఖ్య మొత్తం 308, అని దీరా రేవతి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో 6వ వార్డు మాజీ కౌన్సిలర్ చింతలపల్లి సంధ్యా రవీందర్ రెడ్డి, దీరా జ, రేవతి , వార్డు ఆఫీసర్ రాములు , దీరా లు వినోద్ సాగర్, కొమ్ము రవికుమార్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రామకృష్ణ , రాములు యాదవ్, శేఖర్, మరియు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఈనాటి గా×= ప్రక్రియ కార్యక్రమంలో పాల్గొన్నారు...

# గోదావరి పుష్కరాల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ.

**- సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.**

నిజామాబాద్ జులై22:( విజన్ ఆంధ్ర) : రాబోయే గోదావరి పుష్కరాలకు పటిష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. నిజామాబాదు పోలీస్‌హా కమీషనరేట్ పరిధిలోహాగోదావరిపుష్కరాలు -- 2027 సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పుష్కర ఘాట్ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలు , ట్రాఫిక్ నిర్వహణ , పార్కింగ్ ఏర్పాట్లు , సీసీ కెమెరాల ఏర్పాటు , ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు , అత్యవసర సేవల పై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధ్యక్షతన పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలు – 2027 అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక మహోత్సవమని , లక్షలాది మంది భక్తులు కమిషనరేట్ పరిధిలోని పుష్కర ఘాట్లకు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా ప్రతి ఘాట్‌కు ప్రత్యేక బందోబస్తు ప్రణాళిక రూపొందించి , రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన సంఖ్యలో పోలీసు అధికారులుహా సిబ్బందిని నియమించాలని సూచించారు.
పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ప్రవేశ , నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు , క్యూ లైన్లు , బ్యారికేడ్లు , హెచ్చరిక బోర్డులు , దిశా నిర్దేశక సూచికలను ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు , దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. హావాహనాల రద్దీని నియంత్రించేందుకు ఘాట్లకు దూరంగా తగిన పార్కింగ్ స్థలాలను గుర్తించి , అక్కడి నుంచి షటిల్ వాహనాల ద్వారా భక్తులను ఘాట్లకు తరలించే విధంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసి , ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు , సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లు , పార్కింగ్ ప్రదేశాలు , ప్రధాన కూడళ్లు , రహదారులు ఇతర కీలక ప్రాంతాల్లో అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి , వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి 24 గంటల పాటు నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అవసరమైన చోట డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టి జనసమ్మర్థాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు సమాచారాన్ని చేరవేసేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ , డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు , హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని , తప్పిపోయిన చిన్నారులు , వృద్ధుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య శాఖ , అగ్నిమాపక శాఖ , రెవెన్యూ , మున్సిపల్ , విద్యుత్ , ఆర్టీసీ , నీటిపారుదల , విపత్తు నిర్వహణ తదితర శాఖలతో సమన్వయం పెంచి సంయుక్త కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు.
ప్రతి పుష్కర ఘాట్ వద్ద తాగునీరు , విద్యుత్ , లైటింగ్ , పారిశుద్ధ్యం , తాత్కాలిక మరుగుదొడ్లు , తగినంత వెలుతురు , అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో పుకార్లు , తప్పుడు ప్రచారాన్ని అరికట్టేందుకు సోషల్ మీడియా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని , అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. హాసమావేశంలో ప్రతి ఒక్కరు తమ పరిధిలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరాలు వెల్లడించగా , పోలీస్ కమిషనర్ వాటిని సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. పుష్కరాలకు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి , భక్తులకు సురక్షితమైన , ప్రశాంతమైన , సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు డి.సి.పి ( అడ్మిన్ ) ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ ఎసీపీ లు ప్రకాష్ యాదవ్ , వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీనివాస్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ లు శ్రీధర్ రెడ్డి , మల్లేష్ , గోదావరి పరివాహక ప్రాంతంలోని సి.ఐ లు , ఎస్.ఐ లు , ఐ.టి కోర్ , కమ్యూనికేషన్సిహా సిబ్బంది , పోలీస్ కార్యాలయం సూపరింటెండెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.